వ్యవస్థాపకులు

**కీ॥శే॥ మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా॥ శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

64వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

## అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 64 | జనవరి - ఫిబ్రవరి 2026 | సంచిక - 8-9











64వ సంవత్సరపు ప్రచురణ

Dummy Publication

# గానకళ

డమ్మీ ప్రచురణ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 64 | జనవరి - ఫిబ్రవరి 2026 | సంచిక - 8-9

## ఈ సంచికలో....

పేజిలలో

1. "గడియ గడియకు నిండారు దుడుకు" (అమృతవాహిని) - శ్రీ మల్లాది సూరిబాబు ....3
2. నా సంగీతానుభవాలు - శ్రీ మోదుమూడి సుధాకర్....7
3. పండిట్ జస్రాజ్ - స్వర్గీయ శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ....9
4. కూచిపూడి మార్గాన-నాట్యగురువు శ్రీమతి సీతానాగజ్యోతి - డా.ఎమ్.వి.భారతలక్ష్మి,కాకినాడ....12
5. సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'....16
6. శ్రీ శారదా సంగీత నిలయం, నరసన్నపేట పరిచయం ....27

## ముఖచిత్రం

1) హైదరాబాద్ త్యాగరాజ మహోత్సవంలో సన్మానం అందుకున్న సీనియర్ మృదంగ, ఘట విద్వాంసులు శ్రీ నేమాని సోమయాజులు.

2) హైదరాబాద్ త్యాగరాజ మహోత్సవంలో సన్మానం అందుకున్న మృదంగ విద్వాంసులు శ్రీ కొమ్మాజోశ్యుల సద్గురు చరణ్.

3) 23.2.26న మృదంగ, ఘట వాయిద్య విద్వాంసులు సరస్వతుల హనుమంతరావు గారికి బోడపాడులో స్వర్ణకంకణ ధారణతో శిష్యపరంపర తరఫున సన్మానిస్తున్న ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ సరసి, వారి గురువులు శ్రీతమ్మా సత్యనారాయణ గారు.

4) విదుషి డా. గౌరీ రామమోహన్, విశాఖ రచించిన శ్రీ వేంకటేశ్వర చరితము మరియు ఇతర స్వీయరచనలు పుస్తకావిష్కరణ చేస్తున్న విదుషి శ్రీమతి మండ సుధారాణి.

5) సంగీత విద్వత్సభ కాకినాడ వారి 80 వ వార్షికోత్సవంలో "సంగీత విద్వన్మణి" బిరుదు పొందిన శ్రీ పాల్ఘాట్ రాంప్రసాద్.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు - వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

గతానికి స్వాగతం

# "గడియ గడియకు నిండారు దుడుకు"

(అమృతవాహిని)



- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

ఆకలికి అన్నం. వేదనకు ఔషధం. యిదివరకటి రోజుల్లో, అన్నసత్రాలుండేవి. పూటకూళ్ళుండేవి. సేవాధర్మంతోనే నడుస్తూండేవి. వదాన్యులు, ఐచ్ఛికంగానే, విరివిగా అన్నదానం చేసేవారు. విత్తంతో బాటు వితరణ స్వభావముండేది. అదో గౌరవంగా భావించేవారు.

అన్నదానం మాటంటే గుర్తుకువచ్చే మహాతల్లి డొక్కా సీతమ్మ. ఉన్న ఆస్తులన్నీ కరిగిపోతున్నా 'అన్నదానం' ఆగలేదు.

రోజులు మారిపోయాయి. పద్ధతులూ మారిపోయాయి. సంప్రదాయ గౌరవానికి అర్థం లేకుండా పోయింది.

ఎక్కడబడితే అక్కడ, ఏది కావాలంటే అదీ, విచ్చలవిడిగా తినటమే లక్ష్యంగా చిన్నా, పెద్దా భోజనశాలలు వెలిశాయి. శుచీ, శుభ్రతతో పనిలేదు. కడుపు నిండితే చాలు – అన్నం పరబ్రహ్మ స్వరూపం' అంటారు.

మనిషి జన్మకు కారణం అన్నం. అన్నాద్భవంతి భూతాని.

ఏ ప్రాణులైనా అన్నం నుండి పుట్టినవే. ఆనందమే మనిషి గమ్యం. అన్నమయ కోశం. ప్రాణమయ కోసం, మనోమయ కోశం, విజ్ఞానమయ కోశం, ఆనందమయ కోసం అనే ఐదు సోపానాలలో ఈశ్వర తత్త్వం ఉన్నట్లు వేదాంతులు నిర్వచించారు.

ఆనందప్రాప్తి లేని మానవజీవితం వృథా యన్నారు త్యాగరాజు.

'ఆనంద సాగర మీదని దేహము భూమికి భార'మని నిర్ద్వందంగా చెప్పారు.

అన్నగత ప్రాణి తన ప్రాణాన్ని అన్నం తినటం వల్ల ఎలా కుదుటపర్చుకుంటాడో, ఎలాంటి ఆనందాన్ని అనుభవిస్తాడో సంగీతానందం కూడా అంతే. శృతి చెప్పినట్లుగా అన్నం ఏడు రకాలు.

1) జలాన్నం, 2) తేజో అన్నం, 3) వాయ్వన్నం, 4) శబ్దాన్నం, 5) బలాన్నం, 6) జ్ఞానాన్నం, 7) పృథివీ అన్నం.

భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములన్నీ పృథివీ సంబంధమైన అన్నం.

రెండోది జలాన్నం. నీరేప్రాణాధారం. మూడోది

వెలుతురు. సూర్యోదయం చూడటం కూడా అన్నంతో సమానమే. వాయుసేవనం, అన్న సమానం. మంచి శబ్దాలు వినటం కూడా అన్నంతో సమానం. మంచి సంగీతం వింటూ కూర్చుండిపోతే ఆకలి గుర్తుకు రాదు.

అలాగే పార్కుల్లో కూర్చుని సేదతీరినా, దానివల్ల లభించేది కూడా అన్నసమానమే. జ్ఞానాన్నం సరేసరి.

ఈ సప్తాన్నాలు మనిషిని అంటి పెట్టుకునే వుంటాయి. అన్నం ఆత్మకు సహాయం చేశేవే.

అందుకే ఆత్మతృప్తికి అన్నం తినటం. ఆత్మకు ఆహారం దొరక్కపోతే కొన్నాళ్ళకు, శరీరంలో తినటానికి ఏమీ లేకపోతే, ఆ జీవికి నిష్క్రమణే మార్గం.

సంగీత విద్వాంసులు, ముఖ్యంగా గాయకులు ప్రత్యేకించి ప్రాణాయామం చేయనక్కరలేదు. రోజూ సంగీత సాధనతో ఉచ్ఛ్వాస నిశ్వాసలను నియంత్రిస్తూ పాడేపాటలోనే ప్రాణాయామం ఉంటుంది.

శుచియై, శుభ్రమైన, సాత్త్వికమైన పోషక పదార్థాలున్న ఆహారం ఒంటికి ఎలా బలమిస్తుందో సుస్వరంతో కూడిన సంగీతం కూడా అంతే.

జిహ్వకో రుచి, పుర్రెకో బుద్ధి. ప్రపంచంలో ఎంత జనాభావుందో అన్ని రకాల మనస్తత్వాలున్నాయి. ఎలాంటి సంగీతం ఎవరెవరెవరికిష్టమో తేల్చి చెప్పలేం.

సంగీత సభల్లో సంగీతం తెలిసినవాడూ బొత్తిగా సంగీతజ్ఞానం లేనివాడూ యిద్దరూ తల లూపుతూనే వింటారు.

ఎవరెవరు ఎందుకు ఆనందిస్తారో తెలుస్తుందా? ఉత్తుత్తి సంగీతానికీ, ఉత్తమ సంగీతానికీ తేడా ఉంది. మనం తినే అన్నం, మనలను నిలబెట్టే ప్రాణం, ఆలోచనలిచ్చే మనస్సు, మనస్సు సంపాదించే విజ్ఞానం, విజ్ఞానం వల్ల కలిగే ఆనందం, యివన్నీ 'పరతత్త్వం' వల్లనే ప్రసాదింపబడుతున్నాయనే జ్ఞానమే మోక్షప్రాప్తికి కారణం.

అన్నం తినటమే ఒక యజ్ఞం. మన శరీరంలోని జఠరాగ్ని మనం తిన్న అన్నాన్ని పచనం చేస్తుంది.

అన్నాన్ని యజ్ఞ పరిభాషలో సోమము అంటారు. యిదే మనలో జరిగే అన్న యజ్ఞం.

దేవతలు అగ్ని ముఖులు. అగ్ని ద్వారానే అన్నాన్ని స్వీకరిస్తారు. మనం తినే ఆహారం కూడా జఠరాగ్ని ద్వారానే చేరుతుంది. ప్రాణాలే దేవతలు. ప్రాణదేవతాశక్తి సంపాదనే అన్నయజ్ఞం.

ఆనందప్రాప్తికి యిదే మూలం. తినటం, నిద్రించడం, భయం ప్రాణులన్నిటికీ ఉన్నా, మానవ జీవిత పరమావధి ఒకటుంది.

ఆ దివ్యమైన జీవన విధానాన్ని కనుగొన్న

కవులు, గాయకులు, వేదాంతులు విజ్ఞానులంతా ఆమార్గంలోనే నడిచారు – మనకోదారి చూపారు.

మనిషి మనుగడకు అన్నం ప్రాధమికమైన అవసరం. అన్నగత ప్రాణాలు, ఆనందగతివైపు నడవాలి. అదే జీవిత లక్ష్యం కావాలి. ప్రాణం బాగుంటే మనస్సు నిర్మలంగా ఉంటుంది. కీలకం అంతా అన్నంమీదే ఉంది.

అతిగా ఎక్కడబడితే అక్కడ నిల్చుండి ఏది పడితే అది తినేవారికీ, ఏమీ తినకుండా ఉపవాసాలుండే వాళ్ళకూ ధ్యానం కుదరదు.

పరిమితమైన ఆహారం, నిద్ర జపతపాదులవల్ల బుద్ధి నిలకడగా ఉంటుంది.

న్యాయంగా కష్టపడి అన్నం సంపాదించాలి. మితంగా తినాలి. ఆ జీవితం పవిత్రమౌతుంది. దొంగతనం వల్లగానీ యితరులను పొగిడిగానీ, మోసగించిగానీ, సోమరితనం వల్ల యాచనచేసి గానీ సంపాదించే అన్నం వల్ల బుద్ధి, కలుషితమౌతుంది.

కడుపే కైలాసం యిల్లే వైకుంఠంగా బ్రతకడం దుడుకు తనంగా వర్ణించారు త్యాగరాజు.

తాను ఎంతో దుడుకుగలవాడినని రామునితో చెబుతూ యిలాంటి నన్ను ఏ దొరకొడుకు రక్షిస్తాడు ? అని లోకంలోని దుడుకులన్నీ తనకు ఆపాదించుకుని రాసిన పంచరత్న కీర్తన "దుడుకుగల నన్నేదొర కొడుకు, బ్రోచురా?" అర్థం తెలియక సాధారణంగా కొందరు సంగీత విద్వాంసులు ఈ కీర్తన పాడుతూ, చరణాల తర్వాత దుడుకుగల నన్నేదొర దగ్గర ఆపేస్తూంటారు.

నిజానికి త్యాగయ్య లో ఈ దుడుకులేవీ లేవు.

ఇంద్రియలోలత్వం వల్ల కలిగే తామస, రాజసగుణాలన్నీ ఈ కీర్తనలో ఉదహరించారు గమనించండి.

మహాత్ములెన్నడూ యితరులలో లోపాలను చూడరు. వారి దోషాలన్నీ తమవిగా ఆరోపించుకుని ఆ జగద్రక్షకుణ్ణి వేడుకుంటారు. అల్పబుద్ధులకే స్వపరభేదాలు. ఉదారులకు లోకమే కుటుంబం.

"విషయాకర్షణ, అజ్ఞానం, భక్తి రాహిత్యం, పరధన కాంక్ష, సుఖలాలసత్వం, కాంతాసక్తి, ఈషణ త్రయం, మొదలైన అన్నీ దుడుకులకూ తినే తిండి ఒకటే కారణం. నాశనం కానిది, శాశ్వతమైనది.

ఆనంద స్వరూపం. దాన్ని సాధించే వివేకం లేకుండా కడుపు నింపుకోవడమే ధ్యేయంగా బ్రతికేవారిని కాపాడేదెవరు?

భగవంతుడు సర్వాంతర్యామి...

ఇందుగలడందు లేడనేది సత్యం. తన లోపలే ఉన్నాడని, తెలిసినా నమ్మకపోవడం ఒక దుడుకు. చిన్నప్పటినుంచి భక్తి భావమంటూ లేకుండా బ్రతికేయడం, మరోదుడుకు. అర్హత లేమీ

లేకపోయినా, యింద్రుడవు చంద్రుడవు అంటూ పొగిడేయడం, అడ్డమైన దారులలో సంపాదించేసి, భోగలాలసతతో గడిపేయటం ఒక బలహీనత.

కొందరు సంగీత విద్వాంసులు తమ నాదవిద్యతో ఆకర్షింపబడే స్త్రీలను వశం చేసుకోవడానికి తహతహలాడుతూంటారు.

ఉత్తమ గాయకులుగా తీర్చిదిద్దుతామని ఆశలు చూపించి వశపర్చుకునే ప్రయత్నం చేస్తారు. బలహీనులు వారి వలలో పడతారు. చివరకూ యిద్దరూ నష్టపోతారు. ఆత్మవంచనతో శిలాత్ములవుతారు. జంతూనాం నరజన్మ దుర్లభం ప్రాణికోటిలో మనిషిగా పుట్టడమే ఓ సుకృతం. ఎలాగైనా బ్రతికేద్దామనుకోవడం అసుర లక్షణం.

మానవతను దుర్లభమనుచునెంచి, పరమానంద మొందలేక, మదమత్సర కామలోభ మోహాలకు దాసుడై మోసబోతి గాక, మొదటి కులజుడగుచు భువిని శూద్రుల పనులు సల్పుచుంటినిగాక, నరాధములను గోలి సారహీనమతములను సాధింప తారుమారు, దుడుకుగల నన్నేదొరబ్రోచురా అనే చరణం ఒక్కటి చాలు, జీవితాలకు. విద్వాంసులు గానం చేస్తోంటే ఈ చరణంలోని భావార్థాన్ని పట్టుకోవడం కష్టం. కానీ, మానవ జీవిత పరమార్థాన్ని తలకెక్కేలా చెప్పిన మాటలివి.

ఎంత నేర్చినా, ఎంత జూచినా, ఎంతవారలైన, కాంత దాసులే అని త్యాగయ్య గారే చెప్పారు. లోకంలో విచ్చలవిడిగా విహరించేవి, కాంతా, కాంచన కాంక్షలు. సంసారం అంటే తమిళంలో భార్య అని అర్థం.

గృహస్థ జీవన పరిణామం సంతానం. కొడుకులుండి, కూతురులేకపోయినా, కేవలం కూతుళ్ళే ఉన్నా కొఱతే. ఈ తాపత్రయంతోనే సంసారం పెరుగుతుంది. ఎంత ఉన్నా యింక చాలు అనే వాడుండడు. సంపాదించడంలో ఒక దుఃఖం, కాపుదలలో మరో దుఃఖం.

ఎంత వెలుగునకు అంతే చీకటి. ఎంత సంపదకు అంతే ఆపద అంటాడు అన్నమయ్య.

మనతో కూడ ఉండేది సంస్కారం మాత్రమే.

సంసారం కాదు, సంసారులైతే నేమయ్యా!

శిఖిపించావతంసుదుండగా! క్రూరపు యోచనలు దూరం చేసి తన దారపుత్రుల పరిచారకుల జేసి సారరూపుని పదసారయుగముల సారె సారెకు మనసార పూజించేవారు సంసారులైతే నేమయ్యా?

దుడుకులన్నీ దూరం కావాలంటే భక్తి ఒక్కటే మార్గం. అదే రాజమార్గం.

★ ★ ★

సుధా తరంగమ్

# నా సంగీతానుభవాలు



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ

సంగీతం బోధించే గురువులు, శిష్యుల నుండి ఎన్నో పాఠాలు నేర్చుకుంటూ ఉంటారు. శిష్యుల సందేహాలు తీర్చటం కోసం గురువులు వెదకని మార్గం ఉండదు. అర్థం అయ్యేట్లు చెప్పటం కోసం ఎన్నో ఉపమానాలకై వెదుకుతూ ఉంటారు.

నా శిష్యుడు ఒకతను తోడి రాగంలో అవరోహణ పాడేటప్పుడు కైసిక నిషాదానికి బదులు కాకలి నిషాదం, సాధారణ గాంధారం బదులు అంతర గాంధారం పాడుతున్నాడు. తోడి కాస్తా మాయామాళవగౌళ అయి కూర్చుంటోంది..ఎన్నివిధాల చెప్పినా ఫలితం కనబడలేదు.చివరికి, “నువ్వు వేగంగా బైక్ నడిపేటప్పుడు అనుకోకుండా గుంత వస్తే బండి అందులో ఎలా దిగిలేస్తుందో అలా నిషాదాన్ని పాడాలి...అంటూ “ని” స్వరాన్ని ఒక JERK తో పాడి వినిపించగానే, సరిగ్గా పాడేశాడు శిష్యుడు. అదే విధంగా గాంధారం కూడా పాడు ..అన్నాను. గాంధారమూ PERFECT గా పాడేసి, నా నెత్తిన పాలు (తోడి) పోశాడు.

ఒక శిష్యురాలితో కళ్యాణి “వాసుదేవయని” కృతిలో స్వరకల్పన పాడిస్తున్నాను. ఎన్నో అలంకారాలు సాధన చేయించటం వలన, స్వంతగా స్వరప్రస్థారం ఆవర్తాల తరబడి పాడేస్తోంది కానీ, చివరికి పల్లవి ఎత్తుకోవటం మాత్రం తెలియట్లేదు. కొత్తగా సైకిల్ నేర్చుకున్న (సైకిల్ అంత కూడా లేని) బుడతడు ఇంటి ముందు అరుగు పైనుండి సైకిల్ ఎక్కి, తొక్కుతూ ఒక ROUND వేసి, దిగటం చేతకాక, మళ్లీ వీధులన్నీ తిరగటం ఉదాహరణగా చెప్పి, గమ్యస్థానం ఎంత దూరంలో ఉందో అంచనా వేసుకుంటూ స్వరాన్ని తదనుగుణంగా కుదించుకొని పాడాలని, లేకుంటే ఆవర్తాలు తిరిగిపోతూ ఉంటాయని చెప్పాను. కొంత ఫలితం కనబడింది.మరో ప్రయత్నంగా, “తప్పటడుగులు వేసే పసిపిల్లవాడు గుమ్మం దాకా నడిచి, గుమ్మం దాటటం చేతకాక, తట్టుకొని చతికిలపడ్డట్టు మొదట్లో ఎవరికైనా ఉంటుంది. గుమ్మం అనేది ఎత్తుకోవలసిన పల్లవి. స్వరాలు అడుగులు. నేలపై ఉన్న TILES, తాళం యొక్క క్రియలు అనుకో.. రోజూ నడవగా నడవగా అదే పిల్లవాడు కొన్నాళ్ళకు గుమ్మాన్ని సమీపిస్తుండగానే తన అడుగులను తగ్గించుచుకోవటమో, పెంచుకోవటమో చేసి, లెక్కగా TILES పై అడుగులు వేస్తూ, గుమ్మాన్ని ఎలా దాటుతాడో అలా నీ స్వరం యొక్క నిడివిని

నియంత్రించుకోవడం సాధన చేస్తే, పల్లవి తేలికగా ఎత్తుకోగలవు. ఇంకా అనుభవం వచ్చాక ఏ అంచనా అవసరం లేకుండానే అలవోకగా పల్లవి ఎత్తుకోవటం వస్తుంది" అని చెప్పాను. అంతే.. ఠక్కున పల్లవి అందుకుని, పాడేసింది నా శిష్యురాలు.

దాటు స్వరాలు పాడేటప్పుడు, ఒకస్వరం నుండి దూరంలోని మరో స్వరంలోకి దాటటంలో ఖచ్చితత్వాన్ని వివరించటం కోసం, "తొక్కుడుబిళ్ల ఆటలో బిళ్ళను అనుకున్న గడిలోకి ఖచ్చితంగా ఎలా విసురుతామో అలాగే దూరంలోని స్వరస్థానాన్ని అందుకుని పాడాలని చెప్తూ ఉంటాను. అయితే ఈ తరం పిల్లలకి తొక్కుడుబిళ్ల ఏమి తెలుసు? అందుకోసం ఆలోచించి, టెన్నిస్ కోర్టు దాటకుండా బాల్ ను అనుకున్న దూరానికి రాకెట్ తో కొట్టటాన్ని ఉదాహరణగా చెప్పటం ఆరంభించాను.

"స్వరాలు మెట్లులాంటివి. ఎక్కేటప్పుడు ఒక మెట్టు దాటి ఆ పైమెట్టుకు ఎక్కాలంటే ఎలాగైతే నిలుచున్న మెట్టును బలంగా తన్ని, పైకి అడుగు వేస్తామో అలాగే స్వరాన్ని కొట్టి చెప్తే తేలికగా అందుకోగలం. అలా కొట్టటాన్నే ఒక గమకం అంటారు" అని చెప్తూ ఉంటాను.(ఉదా: శంకరాభరణ రాగ ఆరోహణలో రిషభ, మధ్యమ, దైవతాలు). అయితే, మెట్లు దిగేటప్పుడు ఏ అదనపు బలప్రయోగం అవసరం లేనట్లే, అవరోహణలో ఏ గమక ప్రయోగమూ అవసరం లేదు. అయితే జారిపడిపోకుండా (స్వరాన్ని) పట్టుకొని, జాగ్రత్తగా దిగటం మాత్రం అవసరం"...

"శాకంబరి" అనే పదం పాడిస్తుంటే, "శా" బదులు "షా" లేదా "సా" అంటోంది ఒక స్టూడెంటు. చివరికి శారీ అనమంటే అది మాత్రం సరిగ్గా అంది. "అదేమిటి? షారీ / సారీ అనలేదే?" అని ప్రశ్నించాను. ఆంగ్లం అయితేనే సరిగా ఉచ్చరిస్తారు ఈతరం పిల్లలు కొందరు. శారీ (SAREE), షేర్ (SHARE), సారీ (SORRY) ఈ మూడు ఆంగ్ల పదాలు ఎవరైనా సరిగ్గా పలుకుతారు కనుక, తెలుగు లోని శ,ష,స ..అక్షరాలూ వారికి వచ్చితీరతాయి.

"శిష్యులు గురువుగారిలో మంచి లక్షణాలకన్నా, అవలక్షణాలను త్వరగా గ్రహిస్తారని" పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి నమ్మకం. అందుకే సాధన చేసేటప్పుడు అద్దం ఎదురుగా కూర్చొని, ముఖ వికారాలు లేకుండా పాడటం తను ముందు సాధనచేసి, తరువాత శిష్యులకు చెప్పేవారు.

'వీణ విద్వాన్' అయ్యగారి శ్యామసుందరం గారు విద్యార్థులకు తేలికగా అర్థం కావటం కోసం, "అన్నంలో రాయిలాంటిది 'అపస్వరం' (ఉ: 'హిందోళ'లో రిషభం); పాయసంలో జీడిపప్పులాంటిది 'అన్యస్వరం' (ఉ:'సారంగ'లో శుద్ధమధ్యమం) అని చెప్పేవారు.

"పంచుతూ పోతే ఏదైనా తరిగిపోతుంది. కానీ జ్ఞానం మాత్రం పంచుతున్న కొద్దీ పెరుగుతుంది"

★★★

# పండిట్ జస్రాజ్

జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సి.పి.బ్రౌన్ గ్రంథాలయ శిల్పి



పండిట్ జస్రాజ్ వర్తమాన గాయకులలో అగ్రగణ్యులు, భావపూర్ణమైన సంగీతం, స్వర మాధ్యమంతో కావ్య సౌందర్యాన్ని ప్రదర్శించటం జస్రాజ్ ప్రత్యేకత. 'మేవాడి' ఘరానాకు చెందిన విఖ్యాత సంగీత కళామూర్తి జస్రాజ్. శాస్త్రీయ సంగీతం కావచ్చు, గీత గోవిందం వంటి సంగీత రూపకాలే కావచ్చు, వల్లభ సంప్రదాయ కీర్తనలు కావచ్చు. అన్నిటిలోను వారి విశిష్ట భావపూర్ణ గాన శైలి శ్రోతలను తన్మయులను కావిస్తుంది.

తమకత్యంత అభిమాన పాత్రమైన హవేలి సంగీతం, భక్తిగీతాల ఆలాపనలో ఆయనకాయనే సాటి అని అంటారు సంగీత రసజ్ఞులు.

సంత్ సూరదాస్ పంచశత సంస్మరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత సమారోహ్, సూరదాస్ గుణ గానాన్ని చేయడానికి సంగీత విద్వాంసులందరూ ఏకగ్రీవంగా జస్రాజ్ ను ఎన్నుకున్నారు.

హర్యానాలో జన్మించి, ఆంధ్రప్రదేశ్లో పెరిగి, గుజరాత్లో ఎదిగి, చివరకు ముంబైలో స్థిరపడిన జస్రాజ్ స్వదేశంలోనే కాక, విదేశాలలో కూడా ఎన్నో ప్రదర్శనలిచ్చి ఘనసత్కారాలనందుకొన్నారు. అరవై ఎనిమిదేళ్ళ వయసులో ఆయన "వెనుదిరిగి చూసినపుడు... నేను సాధించింది ఏమీ లేదు అనిపిస్తుంది. సమయ్ హాథ్ సే గయా" అంటూ వినయంగా చెబుతారు. ఆయన జీవితంలో ఎన్నో చేదు అనుభవాలున్నాయి. జస్రాజ్ వాద్యంలో దిట్ట. సంగీత కచేరీలలో తబలా, హార్మోనియం వాదకులు కూడా వేదికపై గాయకునితో పాటు కూర్చోవాలని ఆయన అభిమతం.

తమ పద్నాలుగవ ఏట లాహోర్లో జరిగిన సంఘటనను ఆయన మరవలేదు. వేదికపై తనకు కూడా (తబలావాదకుడు) స్థానం కల్పించమన్నాడు. "చచ్చిన చర్మాలపై వేళ్ళాడించే నీకు సంగీత వేత్తల సరసన స్థానమా?" అన్నారు. ఆ మాట శరాఘాతంలా తగిలిందాయనకు. ఆనాడే సంగీత విద్యాంసుడు కావాలనే శపథం చేశారు. ఆ సంఘటన జస్రాజ్ జీవితాన్ని మలిచింది. చిత్రాలను నిర్మించారు.

జస్రాజ్ దంపతుల కుమారుడు సారంగదేవ్. 14వ ఏటనే శాంతారాం 'రాజా రాణికో చాహి యేసినా' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. 13వ ఏటనే

అతని సంగీత రికార్డులు వెలువడ్డాయి. కూతురు దుర్గ సంగీతంలో నిష్ణాతురాలు. విదేశాల్లో తండ్రితోపాటు కచేరీల్లో పాటలు పాడేది. తాత శాంతారాం చిత్రాల్లో పాటలు పాడింది. పండిట్ జస్రాజ్ ను 1975 లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదుతో సత్కరించింది. 1976లో హర్యానా ప్రభుత్వం 'సంగీత మార్తాండ్' బిరుదుతో గౌరవించింది. ఆయనతో జరిపిన ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు....

'మేవాడీ' ఘరానా పుట్టుక, వికాసం... జస్రాజ్ కు ఘరానాతో గల సంబంధం గురించి...

"ఘరానాలు ఎక్కువగా స్వామి హరిదాస్ నుండే అవతరించాయి. రాజస్తాన్, హర్యానా, ఆజ్మీర్ ప్రాంతాలకు చెందిన సీమను 'మేవాత్' అంటారు. శక్కర్ ఖాన్, మక్కర్ ఖాన్లు ఈ ఘరానాలో ప్రసిద్ధులు. వీరే "ఖయాల్ పద్ధతి"ని ప్రారంభించారు. ఈ పరంపరలోని అలీ ఖాన్ శిష్యుడు నజీర్ ఖాన్ మేవాడీ ఘరానా స్థాపకులు సర్దూలాల్, చమన్లాల్లో, మా తండ్రి మోతీరాంజీ, చిన్నాన్నజ్యోతి రామ్ మేవాడీ ఘరానా ప్రసిద్ధికి కారకులు.

తండ్రిప్రభావం "మా తండ్రి ఆశ్రయ భాగ్యం ఎక్కువ కాలం నాకు లభించలేదు. వారు కన్ను మూసేనాటికి నేను కేవలం నాలుగేళ్ళవాణ్ణి. వారు కాశ్మీర్ మహారాజా ప్రతాప సింహ్ ఆస్థాన కళాకారులలో ఒకరు. తర్వాత హైదరాబాద్ చేరారు. అక్కడ దర్బారు గాయకులుగా ఘన సన్మానం అందుకొనే రోజు ఉదయం వారు అకస్మాత్తుగా మరణించారు. మా అన్న పండిట్ మనిరామ్ నన్ను పోషించారు. వారే నా సంగీత గురువు. వారు పాడుతుంటే నేను తబలా నేర్చుకున్నాను. అప్పట్లో మా కుటుంబం ఆర్థికంగా దుర్దశలో ఉండేది."

విదేశీ శ్రోతలకు, మన దేశ శ్రోతలకు గల తేడాలు... "అక్కడి శ్రోతలు క్రమశిక్షణతో వ్యవహరిస్తారు. సరైన వేళకు వస్తారు. వారు రావటానికి ఆలస్యమైతే పాడుతున్న పాట పూర్తి అయ్యేదాక బయటనే నిల్చుంటారు. ఆ తర్వాతే సభామందిరంలోకి వస్తారు. పాట పూర్తి అయితేనే వారు హర్షధ్వానాలు చేస్తారు."

సినిమా సంగీతం గురించి అభిప్రాయం...... ఎవరేమనుకొన్నా నేను ఈ పాటలను ప్రశంసిస్తాను. ఎందుకంటారా? ఈ పాటలే మన సంగీత కళాకారులను వారితో పాటు శాస్త్రీయ సంగీతాన్ని ప్రతి ఇంటికి చేరవేస్తున్నాయి". లతా మంగేష్కర్ వలననే మనదేశంలో బాలబాలికలు బాత్రూమ్లో పాటలు పాడసాగారు. ఈ మాట మీకు విడ్డూరంగా కనిపించినా, సంగీత ప్రపంచానికో వరప్రసాదం. దీనిని లతా మంగేష్కర్ పురస్కారంగా భావించవచ్చు. శాస్త్రీయ సంగీతాన్ని సినిమా పాటలకు కలిపిన నౌషద్ అలీ, సి. రామచంద్ర, రోషన్, మదన్ మోహన్ వంటి సంగీత దర్శకుల్ని మనం మరవలేము.

జస్రాజ్ గారి హృదయ సంపదను నిరూపించే ఘట్టాలు కొల్లలు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడైన బాలుడొకడు జస్రాజ్ దర్శనం కొరకు తపించేవాడు. వృద్ధుడైన ఆ బాలుని తండ్రి జస్రాజ్ను కలుసుకొని తన కుమారుని కోరికను తెలిపాడు. వెంటనే ఆసుపత్రికి వెళ్ళారు. పాటల కేసెట్లు ఇచ్చారు. బాలుని పక్కనే కూర్చొని సాంత్వన వాక్యాలు పలికారు.

ఆ ఊళ్ళో ఉన్నవాళ్ళు ఆ బాలుని వద్దకు వెళ్ళి, కొన్ని నిమిషాలైన గడిపి వెళ్ళేవారు.

ఒకమారు పండిట్ జస్రాజ్ ఒక ఊళ్ళో కచేరి ముగించేసరికి రాత్రి మూడుగంటలైంది. తిరుగు ప్రయాణంలో ఒక గ్రామాన్ని చేరారు. గ్రామప్రజలు కారుచుట్టూ మూగారు. 80 ఏళ్ళ గ్రామ పెద్ద మాట్లాడుతూ "పండిట్ జీ వయోభారంతో తమ కచేరీకి రాలేకపోయాను. ఆరోగ్యం కూడా అంతమాత్రమే. తమగానం వినేభాగ్యం మాకు లేదేమో" అంటూ కన్నీరు

కార్చాడు. ఆ మాట విన్నంతనే పండిట్ జస్రాజ్ తో "క్యా హువా? హమ్ అభీ సునాతే హై" అంటూ గ్రామప్రజల మధ్య తంబూరా శ్రుతి చేసుకొని పాడారు. మనసు విప్పి పాడారు. గ్రామ పెద్ద ఆనంద బాష్పాలు రాలుస్తూ విన్నాడు. తిరిగి వెళ్తూ "ఈ రోజు నేనేదో పరమార్థాన్ని సాధించిన అనుభవం" కల్గిందన్నారు.

పండిట్ జస్రాజ్ భక్తి తత్పరులు. ప్రతి కచేరీ చివర, తమకు అత్యంత ప్రీతిపాత్రమైన, జనప్రియమైన "మహాకాళీ భవానీ...." పాట పాడుతారు. ఈ కృతిని రచించినది ఆయనే.

జస్రాజ్ తమ సీనియర్ కళాకారుల పట్ల అత్యంత గౌరవభావం కల్గివుంటారు. అమరావతిలో ఒక జోగిని గానం చేసిన 'జీవనపురి' రాగం విని ఆనంద బాష్పాలు రాల్చటం వారి సహృదయతకు సాక్ష్యం. పండిట్ భీమ్ సేన్ జోషికి సన్మానోత్సవంలో పాల్గొన్న జస్రాజ్ సంగీత ప్రపంచంలో తాన్సేన్ తర్వాత సంగీత సామ్రాజ్య చక్రవర్తిత్వానికి అర్హులు భీమ్ సేన్ జోషి మాత్రమేనని అన్నారు. పండిట్ రవిశంకర్, తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి జస్రాజ్ సంగీత వైదుష్యాన్ని ముక్త కంఠంతో ప్రశంసించారు.

యువతరానికి చెందిన సంగీత కళాకారుల పట్ల ఎంతో ఆదరం కల జస్రాజ్ ఈనాటి యువకళాకారుల జ్ఞానం అగాధం; సాధన చేయాలన్న పట్టుదల వారిలో ఉంది. అందుకు అనుగుణంగా కొత్త పరికరాలున్నాయి. వారికి తగిన మార్గదర్శకత్వం అవసరం" అంటారు. ఆయన తమ తండ్రి స్మృత్యర్థం పండిట్ మోతీరామ్ సంగీత నాట్య అకాడమీ స్థాపించి యువ కళాకారులను తీర్చిదిద్దుతున్నారు.

**ప్రతిభావంతుల కుటుంబం :**

ప్రముఖ చిత్ర నిర్మాత, దర్శకుడు శాంతారామ్ కుమార్తె మధురా జస్రాజ్ అర్ధాంగి. ఆమె స్వయంగా గొప్పగాయని, రచయిత్రి, సంస్కృత భాషా విశారద, సినిమా, నాటకాల దర్శకురాలు, టి.వి. కార్యక్రమాల దర్శకురాలు కూడా.

శాంతారామ్ ఆత్మకథ 'శాంతారామా'ను తండ్రి చెప్పగా శ్రీమతి మధురాక్షర బద్ధం చేశారు. దూరదర్శన్ రేడియో, టీవిలలో ప్రసారమయ్యే సంగీతంలో ప్రభుత్వ ప్రమేయం గురించి: ప్రభుత్వం విదేశాల్లో సంగీత ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నది. అది హర్షించదగ్గ విషయం. కాని అంతదూరం వెళ్ళిన వాద్యకారునికి లేదా గాయకునికి కేవలం పాతిక నిమిషాల వ్యవధిని ఇస్తారు. ఈ కార్యక్రమాల ద్వారానే, అక్కడివారికి కళాకారుల పరిచయం ఏర్పడుతుంది. చిత్రంలోని ఏదో ఒక అంశాన్ని మాత్రమే వారెందుకు చూపరు? నృత్య కళాకారులకు, సంగీత కళాకారులకు పూర్తి కాలం ఎందుకు కేటాయించరు? 10,15, నిమిషాల్లో భారతీయ సంగీత వైశిష్ట్యాన్ని విదేశీయులకు నివేదించగలమా? కనీసం రెండు గంటలైనా కళాకారునికి కేటాయించాలి. పలుమార్లు ఈ విషయం నేను చెప్పాను. ఈ తర్కమే రేడియో, టీవీలకు కూడా వర్తిస్తుంది.

"శాస్త్రీయ సంగీతానికి మృతి లేదు. గజల్స్. భజనలవల్ల శాస్త్రీయ సంగీతానికి అవరోధం ఏర్పడుతూ ఉందన్న వాదం ఉంది. కానీ శాస్త్రీయ సంగీత అభిమానుల, సంఘాల గణనీయమైన కృషివల్ల శాస్త్రీయ సంగీతం గురించిన ప్రచారం మంచి స్థితిలోనే ఉంది".

"శాస్త్రీయ సంగీత ప్రాచుర్యానికి ప్రభుత్వం, ప్రజలు ఏం చేయాలి?"

"ప్రభుత్వం ముందుగా సంగీత కళాశాల విద్యార్థులకిచ్చే విద్యార్థి వేతనం మొత్తాన్ని పెంచాలి. క్రీడారంగంలోని క్రీడాకారుల్ని పెద్ద పారిశ్రామిక సంస్థలు ప్రోత్సహించినట్లే ప్రతిభావంతులైన సంగీత కళాకారుల్ని ప్రోత్సహించాలి."

**– శ్రీ సామల సదాశివ సంస్మరణ సంచిక నుండి వారి సౌజన్యంతో**

# కూచిపూడి మార్గాన-నాట్యగురువు శ్రీమతి సీతానాగజ్యోతి



కూచిపూడి నాట్య సంప్రదాయంలో అనేక మంది విశిష్టమైన గుర్తింపు తెచ్చుకొన్న నాట్యాచార్యులున్నారు.ఈ కళావైభవానికి తనదైన సేవలందించి గుర్తింపు పొందిన శ్రీమతి సీత తనదైన ముద్ర వేసుకొన్నారు. వారిభర్త మరో ప్రఖ్యాత నాట్యాచార్యుడు శ్రీ నాగజ్యోతి గారితో వివాహం మరిన్ని కీర్తి బావుటాలను ఎగుర వేయించింది.



ఢిల్లీ కేంద్రంగా గత 30సంవత్సరాలనుండి వారు నిర్వహిస్తున్న "తమిళ సంగం, "త్రివేణి కళాసంగం", వారింట జరిగే శిక్షణ, ఆన్లైన్ తరగతులు ఇలా వందల సంఖ్యలో శిష్యులు...వాసిలో కూడా అంతే విలువ. "పద్మభూషణులు"వెంపటి చినసత్యం గారి శిష్యులే వీరిద్దరూ కావడం విశేషం.



క్రమశిక్షణకు మారుపేరైన గురువుగారి శిక్షణలో కూచిపూడి విలువలు కాపాడే బాధ్యతవీరి భుజస్కందాలపై వేసుకొన్నారు. శిష్యురాలిగా గురుకులవాస పద్ధతిలో నేర్చుకొని ప్రదర్శనలిచ్చి, వారి సహాయకులుగా పదిహేన్నేళ్ళపాటు శిష్యులతయారి లో విశేషమైన సహకారం అందించారు. మదరాసులో కూడ వీరి శిక్షణతరగతులు ఏర్పాటయినాయి.

ఈ సేవ ను గుర్తించే 'కేంద్ర సంగీతనాటక అకాడమి'వారు సీతగారి "నాట్య జీవితం-కృషి"పై ఒక చక్కని డాక్యుమెంటరీ నిర్మింపజేశారు. అంతేకాదు, 2024 లో ఆమె రచించిన"కూచిపూడిలో వృత్తి-ప్రవృత్తి" పుస్తకాన్ని అకాడమి కార్యదర్శి డా.సంధ్య, సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీమతి ఉమాసుందరి ప్రచురించి ఆవిష్కరించి వెలుగులోనికి తెచ్చారు. ఆమె ఇంగ్లండులో, అమెరికాలో శిక్షణా

తరగతులు నిర్వహించారు. 2017లో ఆఫ్రికాలో జరిగిన 'భారతీయ కళోత్సవానికి' భారతప్రభుత్వం తరఫున పర్యటించి ప్రదర్శనలిచ్చారు.



వీరి శిష్యులలో శ్రీతనయశర్మ, శ్రీమతి స్రవంతి రాల్ఫ్ స్ లు జకార్తా, పారిస్, ఇండోనేషియాలలో ప్రదర్శనలతో పాటు శిక్షణనిస్తూ విద్యార్థులను తయారు చేస్తున్నారు. కమలారెడ్డి, వెంపటి రవిశంకర్, అనురాధ జొన్నలగడ్డ, పసుమర్తి శ్రీనివాసులు, దీపికారెడ్డి, కల్పలతిక, సీమా విశ్వనాథన్, పహీహా దేశాయ్, కనక సుధాకర్, జలజకుమార్, అమృతలహరి, అభినయ నాగజ్యోతి, అశ్వతికృష్ణకుమార్, మృణాళిని సలాది వంటి ఎందరో శిష్య గణం దశదిశలా కూచిపూడి ఘనతను గురువుల ఖ్యాతిని వ్యాపితం చేస్తున్నారు. రాష్ట్ర పతిభవన్ లోను, కుంభమేళ సాంస్కృతిక ఉత్సవాల లోను, అతుల్యభారత్ (నార్త్ కల్చరల్ జోన్) లోను ప్రదర్శనలిచ్చారు.




ప్రభుత్వ పరంగా లభించే నేషనల్, జోనల్ ఉపకార వేతనాలు పొందినవారిలో వీరి శిష్యుల సంఖ్య అనంతం. అంతటి ప్రతిభా వంతులుగా తీర్చి దిద్దడంలో ఈ దంపతుల అవిరామ శ్రమ, అకుంఠిత దీక్ష అసమానం. గతంలో "ది హిందు" –'నీట్ నట్టువార్', 'టార్చ్ బేరర్ ఆఫ్ కూచిపూడి' అని ప్రశంసించింది. పార్లమెంటు సభ్యులు సోనాల్ మాన్ సింగ్, మాజి కేంద్రమంత్రిణి స్వర్గీయ సుష్మాస్వరాజ్ సన్మానించారు. వాజ్ పాయ్ సంస్మరణ అవార్డ్ అతల్ సమ్మాన్, విక్రమ్ గౌడ్ వెంపటి చిన సత్యం ఇంటర్నేషనల్ అవార్డ్, హయగ్రీవ సొసైటీ, న్యూఢిల్లీ వారి "శ్రేష్ఠ నృత్య ఆచార్య అవార్డ్", సత్యాంజలి కూచిపూడి, కొచ్చిన్ సంస్థ "అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కూచిపూడి" అందించింది. ఇలా ఎన్నెనో అవార్డులు అందుకొన్నారామె.



గురువుగా ఓపికగా, ఓరిమితో బోధన చేయడం వీరి ప్రత్యేకత. ముద్రలు పట్టించే సమయంలోను, గ్రీవాభినయం నేర్పే సమయంలోను గురువుకు ఎనలేని ఓర్పు అవసరమంటారు.ఈ సల్లక్షణాలన్నీ కలబోసుకొన్న సీతానాగజ్యోతి గారి శిష్యులు ఈమెను “సీతక్క”అని గౌరవిస్తారు. ఒకలా చెప్పాలంటే ఆమె కూచిపూడి వ్యవస్థకే – సీతక్క.. పెద్దక్క.. .



దశాబ్దాల క్రితం కూచిపూడిలోకి పురుషుల స్థానే మహిళలు ప్రవేశించే ఉత్కర్ష దినాలలో కాకినాడ లో అడ్వకేట్ అయిన కావలి శ్రీరామమూర్తి, వారి శ్రీమతి శేషసాయి దంపతులకు మూడవ కుమార్తెగా జన్మించిన సీతాకుమారి తల్లి పుట్టింటివారు తుర్లపాటి, దుగ్గిరాల వారు. స్వాతంత్ర్య ఉద్యమకార్యాచరణలో తమవంతు సవలందించిన వారు. ఆడపిల్లలకు విద్య, వృత్తి విద్య నేర్పాలి, వారికి జీవనోపాధి కల్పించాలి అన్న తపనతో “విద్యార్థినీ సమాజం”స్థాపించిన వారు. ఈ నేపథ్యంలో నాట్య శిక్షణకూడా ఉండేది. నాట్య గురువులు శ్రీనివాసన్; రుక్మిణిదేవి శిక్షణనిచ్చేవారు. సీత గారు తల్లి ప్రోద్బలంతో నాట్య శిక్షణ ఆరంభమైంది.



గురువు శ్రీనివాస్ ఆదరంతో నేర్పినా... కాలాంతరంలో సీనియర్ శిష్యురాండ్రయిన స్వర్ణ, మణి లను తీసుకొని మద్రాసు వెళ్ళ వలసివచ్చింది. (ఈ మణి అన్న కళాకారిణే తరువాత కాలంలో గీతాంజలి పేరున సినీ నాయిక గాపేరొందారు) రుక్మిణి దేవి సంస్థకు ఆలంబనమై విద్యార్థులకు జానపద గేయాభినయాలుకూడా నేర్పుతూ ఆసక్తిని

పెంచారు. కూచిపూడి నాట్యం ప్రధానంగా సాగేది.



నాట్యం లో రాణిస్తున్న సీతాకుమారి తదనంతర శిక్షణ కు మదరాసు లో వెంపటి చినసత్యం గారి వద్ద చేరారు. సుదీర్ఘ కాలపు శిక్షణ అనంతరం, సత్యంగారి సహాయకురాలిగా పదోన్నతి లభించింది. మేనకా విశ్వామిత్ర, చండాలిక వంటి రూపకాలకు నృత్య దర్శకత్వ బాధ్యత లను ఈమెకిచ్చారు గురువు సత్యం మహాశయులు. రాజీ పడని గురువు బాధ్యత ఇచ్చారంటే అంతకన్న ఎవార్డ్ ఏమిటుంటుంది. అది ఆమె విద్వత్తుకు కొలమానం. కాలమాన పరిస్థితులను ఎదుర్కొని బి.ఏ., ;ఎమ్.ఏ., హిందీ విశారద పట్టాలు కూడా సాధించారు.



ప్రదర్శనలివ్వడం కంటే శిక్షణ ఇవ్వడంలోనే వారికి సంతృప్తి. ఆ కోణంలో ముందుకు సాగుతూ ఆచార్యత్వాన్ని అందిపుచ్చుకొన్నారు.వీరి కుమార్తె అభినయ కూడ లబ్ధప్రతిష్టురాలు కావడం విశేషం. ఢిల్లీ యూనివర్సిటీ లో ప్రొఫెసర్ గా బాధ్యత నిర్వహిస్తూ, నాట్యంలో శిష్యులను తయారు చేస్తూ ఈ మధ్యనే ఆగస్టు 15న కాకినాడ సూర్యకళామందిరంలో "కూచిపూడి మార్గం" పేరున రక్తి వంతమైన ప్రదర్శన అందించారు.

గత ఆగస్టు నెలలోనే 23, 24 తేదీలలో కాకినాడ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యాన నృత్యసామ్రాట్ అ.ఆనెం లక్ష్మణరావు స్మారక "జీవన సాఫల్య పురస్కారం" అందుకొన్నారు శ్రీమతి సీతానాగజ్యోతి.





–డా.ఎమ్.వి.భారతలక్ష్మి,కాకినాడ.

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## నవరాత్రి ఉత్సవాల్లో భద్రకాళి అమ్మవారి ఆలయంలో వయొలిన్ ప్రదర్శన




వరంగల్ శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో, దేవి నవరాత్రుల ఉత్సవాల ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా, అక్టోబర్ 1న సాయంత్రం కార్యక్రమంలో వయొలిన్ కళాకారుడు వినయ కృష్ణ గారు వివిధ ప్రసిద్ధ భక్తి కృతులను, అనునీత రాగాలు, తాళాలతో ఆలపించారు:

1. శుద్ధ ధాన్య వర్ణం – ఆదితాళం, రచన: ముత్తయ్య భాగవతార్

2. వినాయక నిన్ను వినా – హంసధ్వని రాగం, ఆది తాళం, రచన: గోపాల దాసర్

3. సుగంధ పుష్ప మలయమారుత్ – రూపక తాళం, రచన: ముత్తయ్య భాగవతార్

4. తాయే త్రిపుర సుందరి – శుద్ధ సావేరి రాగం, ఖండ చాపు తాళం, రచన: పెరియ సామీ తూరాన్

కార్యక్రమానికి YSS రవితేజ మృదంగ వాద్య సహకారం అందజేశారు, ప్రదర్శనను మరింత రసభరితంగా, భక్తి వైభవంతో నింపారు.

కార్యక్రమం ముగిసిన తరువాత, నిర్వాహకులు ఉమ్మడి లక్ష్మణా చారి కళాకారులను సత్కరించారు. ఈ సత్కారం ద్వారా కళాకారుల ప్రతిభకు ప్రాణపరిచిన విధంగా ప్రాచుర్యం మరియు ప్రోత్సాహం కల్పించబడింది.

### శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ వరంగల్ లో డిశంబర్ 14వ తేదిన జరిగిన సంగీత కచేరి



**శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గారు**
గాత్రము

**శ్రీ చావలి శ్రీనివాస్ గారు**
వయొలిన్

**శ్రీ ఏడిద భీమశంకర్ గారు**
మృదంగం

# ఘనంగా మార్గశిర సంగీతోత్సవం మరియు వయొలిన్ ఉత్సవం



విజయనగరం రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఉత్తరాది మఠం శాఖ కానుకుర్తి వారి సత్రంలో మార్గశిర మాస సంగీతోత్సవం అలాగే డిసెంబర్ 13 వ తేదీ ప్రపంచ వయొలిన్ వాద్య ఉత్సవం... శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. అకాడెమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి మార్గశిర మాస సంగీతోత్సవం ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. అలాగే వయొలిన్ దినోత్సవం సందర్భంగా ఒక పాశ్చాత్య వాద్యమైన వయొలిన్ మన భారతీయ సంగీతంలో ఎలా ఒక ప్రధాన వాద్యమైనదో వివరించారు. అనంతరం అకాడమీ వయొలిన్ అధ్యాపకులు భానుహర్ష వయొలిన్ పై, మోడేకుర్తి కామేశ్వర రావు వేణువు పై డాక్టర్ మండపాక రవి మృదంగం పై, సతీష్ కీబోర్డ్ పై కీర్తనలు వాయించి విద్యార్థులలో, శ్రోతలలో స్ఫూర్తిని నింపారు. అకాడమీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ డి.వి. శ్రీకాంత్ ప్రతీ ఒక్కరూ సంగీతం నేర్చుకోవడం ద్వారా కలిగే లాభాలు వివరించారు. అకాడమీ నూతన శాఖ ఉత్తరాది మఠం కానుకుర్తి వారి సత్రంలో పెట్టడంవల్ల ఈ చుట్టుప్రక్క ప్రాంతాల వారు ప్రతీ మంగళ, గురు మరియు శనివారాల్లో సాయంత్రం 5.30 నుండి 7.30 వరకు ఇక్కడ సంగీతం నేర్చుకోవచ్చని తెలిపారు. రొటీరియన్లు, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ధవళ సర్వేశ్వర రావు, పద్మప్రియ, సుబ్బారావు, బ్రాహ్మణ సంఘ సభ్యులు పప్పు భోగారావు, మహేశ్వర రావు రావు, తదితరులు, నగరంలోని ప్రముఖులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**– డాక్టర్ మండపాక రవి**

## విశేషంగా అలరించిన వినయ్ శర్వ గాత్ర కచేరి



కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానంలో శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య (పిఠాపురం) ఆధ్వర్యంలో జరిగిన వినయ్ శర్వ (బెంగళూరు) గాత్ర కచేరి విశేషంగా ఆహూతులను అలరించింది. 'భావములోన', 'శివ శివ శివ యనరాద', 'తంబూరి మీటిదవా', 'దత్తాత్రేయ త్రిమూర్తి రూప' తదితర కీర్తనలు వినయ్ శర్వ గానం చేశారు. ఆయనకు వయోలిన్పై శ్రీ హరి ప్రసాద్ (కాకినాడ), మృదంగంపై వి. శ్రీనివాస్ (హైదరాబాద్) చక్కటి సహకారాన్ని అందించారు. రాయవరపు సుబ్బారావు, సీతా లక్ష్మి, గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, సత్య, వెన్నపు చక్రధార రావు, కామేశ్వరశాస్త్రి, వక్కలంక రామకృష్ణ, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

# గాయత్రీ మహిళా సంగీత సన్మండలి - గుంటూరు



స్థానిక గాయిత్రీ మహిళా సంగీత సన్మండలి నెలవారీ కార్యక్రమంలో భాగంగా శ్రీ త్యాగరాజ మందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. వేదుల సూర్యకాంతంగారు దివంగతులైన సందర్భంగా శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. సభకు డా. డి.ఎన్. దీక్షిత్ అధ్యక్షత వహించగా డా. బుసురుపల్లి వెంకటేశ్వర్లు, డా. రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, యం.వై. శేషురాణి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకుని శ్రద్ధాంజలి ఘటించారు.

అనంతరం పారుపల్లి రామకృష్ణయ్యగారి జ్ఞాపకార్థం డా. అన్నవరపు రామస్వామిగారు ప్రతి ఏటా ఒకరికి అవార్డు ఇస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ మోదుమూడి సుధాకర్ గారికి పారుపల్లి



రామకృష్ణయ్య పంతులు గారి అవార్డును ప్రదానం చేసారు. తరువాత సుధాకర్ గారి గాత్ర కచేరీ జరిగింది. మొదట ఎందరో మహానుభావులు, త్యాగరాజ పంచరత్నంతో ప్రారంభించారు. శ్రీ గాయిత్రి సనాతన వలజి రాగంలో, పంతువరాళిలో శివశివ, డా. బాలమురళీ కృష్ణగారు రచించిన గురుపర అనే కీర్తన, బాలమురళి కృష్ణగారి తిల్లానా చాలా అద్భుతంగా, శ్రోతలను మంత్రముగ్ధులను చేసారు. తిరుపతికి చెందిన కె. వేంకట కృష్ణ వైలిన్ పై, యం. హరిబాబు డోలుపై సహకారం అందించారు. శ్రీ దెందుకూరి నారాయణమూర్తి దంపతులు, జ్యోతి ప్రజ్వలన చేయగా ప్రత్యేక అతిథిగా శ్రీ గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యదర్శి మంగ, పాటిబండ లలిత కార్యక్రమాన్ని నిర్వహించారు.

**– మాధవ పెద్ది మీనాక్షి**





**21–12–2025 న సంగీతలహరి రాజమండ్రిలో శ్రీమతి వీరగంట లలితా చంద్రశేఖర్ గాత్రం, హెచ్. రామచరణ్, యం. శ్రీధర్ సహకారాలు**

## హైదరాబాద్ మల్కాజ్గిరి వాణి నగర్ శ్రీ విజయ వినాయక దేవస్థానంలో "సంప్రదాయ" సంస్థవారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంకీర్తనోత్సవ్ 2026



హైదరాబాద్ మల్కాజ్గిరి వాణి నగర్ శ్రీ విజయ వినాయక దేవస్థానంలో "సంప్రదాయ" సంస్థవారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంకీర్తనోత్సవ్ 2026 లో 30-12-2025 నా నా గాత్ర కచేరీ ఏర్పాటుచేశారు. శ్రీమతి దుర్గాభవాని వయోలిన్ పై, శ్రీ జయభాస్కర్ మృదంగంపై,శ్రీ రోహిత్ ప్రసాద్ ఘటంపై చక్కని సహకారం అందించారు. నాట రాగంలో "పవనాత్మజాగచ్ఛ" అనే దీక్షితార్ కృతితో ఆరంభించి, "మాయాతీత స్వరూపిణి" (మయామాళవగౌళ-పొన్నయ్య పిళ్లై), రమామనోహరి రాగంలో "మాతంగీశ్రీరాజరాజేశ్వరి" (రామప్రియ -దీక్షితార్, "సుందరి నీ దివ్యరూపము" (కళ్యాణి-త్యాగరాజస్వామి) తదితర అంశాల అనంతరం, ప్రధాన అంశంగా "తోడి పాడగా హరుడు ఆడెనే, భావ రాగ తాళగతుల" అనే రాగం-తానం పల్లవి పాడాను. శ్రోతలు అందరూ సంగీతజ్ఞులు, సంగీత అభిమానులు కావటం, ప్రత్యేకించి అక్కడ సంగీతం నేర్చుకుంటున్న చిరంజీవులు భక్తి శ్రద్ధలతో వినటం, మంచి స్పందన తెలియజేయటం ఎంతైనా అభినందనీయం. "సంప్రదాయ" స్థాపకులు విద్వాన్ శ్రీజొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్ గారు భాగ్యనగరానికి లభించిన ఒక భాగ్యం. విజ్ఞాన సమితి కార్యదర్శి శ్రీ సుజ్ఞాన్ సంస్థ పక్షాన సత్కరించారు.

## సి.పి.ఎమ్.ఎమ్.టి సంస్థ ప్రధమ వార్షికోత్సవం 14 డిసెంబరు 2025



సి.పి.ఎమ్.ఎమ్.టి సంస్థ ప్రధమ వార్షికోత్సవం 14 డిసెంబరు 2025 విశాఖపట్నంలో జరుపుకుంది. సంగీతం నియమ బద్ధంగా అందరూ నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ సంస్థ గ్రేడ్ ఎగ్జామినేషన్ లను ప్రారంభించింది. వరుసగా తొమ్మిది గ్రేడులను రూపొందించేరు. గ్రేడు 1లో గీతాల వరకూ, గ్రేడు 2 లో వర్ణాలు, కొన్ని కృతులూ, ఈ విధంగా, తొమ్మిది గ్రేడులకు సిలబస్ తయారుచేసి ఈ పరీక్షలను ఈ సంవత్సరంనించి ప్రారంభించేరు. ఈ తొమ్మిది గ్రేడులూ పూర్తి చేయడం వలన సంగీతంలో విద్యార్థులు మంచి పట్టు సాధించ గలుగుతారనే భావనతో. ఈ సంవత్సరం 71 మంది గ్రేడ్ 1 లోనూ, 11 మంది గ్రేడ్ 2 లోనూ ఉత్తీర్ణులయ్యేరు. ఈ విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీమతి నోరి గాయత్రి, చాగంటి ఉమ, మరియు శ్రీమతి శివ కామేశ్వరి లను ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించి జ్ఞాపికలు అందజేసేరు. ముఖ్య అతిధిగా వచ్చిన అడ్వకేటు మరియు విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రెసిడెంట్ శ్రీ కె.వి. రామ్మూర్తి భావితరాలకి ఉపయోగించే చాలా మంచి కార్యక్రమము చేపట్టి నందుకు ఈ సంస్థ వ్యవస్థాపకురాలైన డా॥ గౌరి రాంమోహన్ మరియు శ్రీ. సి.ఎ. వి. వి. రాంమోహన్ గారిని అభినందించేరు.

# శ్రీ శీలేశ్వర సిద్ధేశ్వర దేవాలయము, మంథని








శ్రీ ఏడిద భీమశంకర్ మరియు శ్రీమతి కనకమహాలక్ష్మి దంపతులు ఆధ్వర్యములో శ్రీ శీలేశ్వర సిద్దే శ్వర దేవాలయము, మంథనిలో ప్రొఫెసర్ వెనుకపల్లి తిరుపతయ్య గారి నిర్వహణలో శ్రీ త్యాగరాజ విరచిత పంచరత్న గోష్ఠి గానం అత్యంత వైభవంగా జరిగింది అనంతరము శ్రీమతి గట్టు మాధవి గారి నిర్వహణలో శ్రీ రామదాసు విరచిత నవరత్న కీర్తనల గోష్ఠి గానం అత్యంత మధురంగా జరిగింది శ్రీ ఏడిద భీమశంకర్ మరియు శ్రీ సంతోష్ కుమార్ మృదంగం పై మరియు ఘటం పై శ్రీ జగన్మోహన్ గారు వాయించి సంగీత కార్యక్రమమును రక్తి కట్టించారు గాయకులు ఉమ్మడి లక్ష్మణాచారి గారు, శివకుమార్ గారు, సతీష్ గారు గాయనీ మణులు మంద సుజన గారు, షణ్ముఖప్రియ గారు, మధులిక గారు, కుమారి వేదశ్రీ, గట్టు మాధవి గారు మరియు వారి శిష్యులు ఈ కార్యక్రమము లో పాల్గొన్నారు అనంతరము శ్రీ శీలేశ్వర సిద్దేశ్వర ఆలయ ధర్మకర్తలు శ్రీ శరత్ గారు,శ్రీ రాధాకృష్ణ గారు మరియు శ్రీ శీలేశ్వర సిద్దేశ్వర భజనమండలి సభ్యులు శ్రీ నరహరి గారు, శ్రీ అవధానులు శ్రీనివాస్ గారు, మనోహర్ గారు, గాయక, గాయనీ మణులను సన్మానించారు.



**శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, కొవ్వూరు లో శ్రీ బొడ్డుపల్లి శంకరాదిత్య (వరంగల్) బృందం వారి సంగీత కచేరీ లో వయోలిన్ – శ్రీ బొడ్డుపల్లి సాయిభార్గవ (వరంగల్), మృదంగం – శ్రీ మహాదాసు ఏడుకొండలు (విజయనగరం), ఘటం – శ్రీ కె.వి. రామకృష్ణ**

# శ్రీ వెంకటేశ్వర దేవాలయం (పిట్స్ బర్గ్ ) స్వర్ణ మహోత్సవం - కచేరీ




అమెరికా సంయుక్త రాష్ట్రాలలో, పిట్స్ బర్గ్ లో నెలకొని యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం 50 వ వార్షికోత్సవం పురస్కరించుకొని, ఆలయ కార్య వర్గం వారు స్వర్ణ మహోత్సవాని నిర్వహిస్తున్నారు. ఈ స్వర్ణమహోత్సవం లో భాగం గా మొట్టమొదటి కచేరి శ్రీమతి. శ్రీదేవి జోస్యుల (HOUSTON) బృందం వారి చే డిసెంబర్ 27 –2025 న ఏర్పాటు చేసారు. ఆద్యంతం కడు రమణీయం గా సాగిన ఈ కచేరీ కి చి. ముకుంద్ జోస్యుల వయొలిన్ పైనా, శ్రీ శ్రీరామ కృష్ణ రేకపల్లి మృదంగం పైన ప్రతిభావంతం గా సహకరించి కచేరీకి మరింత వన్నె చేకూర్చారు.

దేవాలయ సాంస్కృతిక కార్యక్రమ అధ్యక్షురాలు శ్రీమతి. మాధవి రాంకుమార్ గారి పరిచయ వాక్యాలతో స్వర్ణ మహోత్సవ సభ ప్రారంభం కాగా, దాదాపు రెండున్నర గంటల పాటు, సాంప్రదాయ బద్ధం గా జరిగిన ఈ కచేరీ లో సుమారు 10 మంది వాగ్గేయకారుల రచనలు గానం చేయడం జరిగింది.

'జయ జయ రమానాథ' – నాట రాగం – అది తాళం లో కూర్చ బడిన నారాయణ తీర్థుల వారి తరంగం తో ప్రారంభించిన ఈ కచేరీలో, గోపాలక పాహిమాం – రేవగుప్తి – మిశ్రచాపు, మహారాజ శ్రీ స్వాతి తిరుణాళ్, అను దినము – బేగడ – రూపకం – శ్రీ పూచి శ్రీనివాసయ్యంగార్, నారాయణ నిన్న నామద – శుద్ధ ధన్యాసి – ఖండ చాపు – శ్రీ పురం దరదాసరు, ఈనాటి నోము ఫలమో – భైరవి – శ్రీ త్యాగరాజస్వామి (ఉప ప్రధానాంశము ), ఇతనికంటే ఘనులు – నవరసకన్నడ – ఆది – శ్రీ అన్నమాచార్య, నిజ దాస వరద – కళ్యాణి – ఆది తాళం – శ్రీ పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ (ప్రధానాంశం), కర్పూరం నారుమో – ఖమాస్ – ఖండ చాపు – ఆండాళ్ పాశురం, పలుకు తేనెల తల్లి – భీంపలాస్– ఖండచాపు – అన్నమాచార్య, యేతీరుగనను – నాదనామక్రియ – అది – శ్రీ భద్రాచల రామదాసు, మాధవునకు మంగళం – కేదారగౌళ – ఆది – అన్నమాచార్య (మంగళం) మున్నగు అంశాలు చోటు చేసుకున్నాయి.

శ్రీ రామసుబ్బారావు మిర్తిపాటి (దేవాలయ కార్యనిర్వాక సభ్యులు) వందన సమర్పణ చేయగా, దేవాలయ ప్రధానార్చకులు శ్రీమాన్ వెంకటాచారి సముద్రాల గారు కళాకారులందరినీ, దుశ్శాలువలతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను అందజేసి, వేదాశీర్వచనాలతో ఆశీస్సులనందజేశారు.

# భక్తిశ్రద్ధలతో త్యాగరాజ ఆరాధన మరియు ఆదిభట్ల నారాయణదాస దివ్యస్మరణ



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం మరియు రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో సద్గురు త్యాగరాజస్వామి 179వ ఆరాధన మరియు ఆదిభట్ల నారాయణ దాసుల 81వ దివ్యస్మరణ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల అర్చకులు ఇరువురి చిత్రపటాలకు హారతులు ఇవ్వగా ఉత్సవం ప్రారంభం అయ్యింది. శ్రీ జమ్ము అప్పన్న బృందం నాదస్వరంతో ప్రఖ్యాత వేణుగాన విద్వాంసులు మోడెకుర్తి కామేశ్వరరావు త్యాగరాజ విశేష వేషధారణతో కోట, గురాచారి వారి వీధి, మఠం వీధి, కానుకుర్తి వారి వీధి మీదుగా క్షేమగణపతి సన్నిధానం ఉత్తరాది మఠం, కానుకుర్తి వారి సత్రం వేదిక వరకు తిరువీధి జరిగింది. అర్చకులు భీమసేనాచార్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమం అనంతరం కార్యక్రమ సౌజన్యమూర్తి డాక్టర్ అయ్యగారి రాఘవరావు త్యాగరాజ జీవిత విశేషాలు తెలియజేయగా కార్యదర్శి మండపాక రవి నారాయణ దాసుగారి విశేషాలు తెలియజేశారు. స్థానిక విద్వాంసులు, విద్యార్థులచే డాక్టర్ కె.ఎ.పద్మప్రియ గారి నిర్వహణలో ఘనరాగ పంచరత్న కృతులు గోష్టి గానం జరిగింది. ఇందులో డాక్టర్ ఎం.ఎ.సుషమ, డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, ఇవటూరి మెహెర్లత, భానుమతి, భాస్కరరావు, సుభద్ర సుశీల, శారద, వోలేటి చంద్రిక శైలజ, అంకిత, గోడా శ్రీదేవి, శ్రీవల్లి, సుబ్బారావు, అకాడమీ విద్యార్థులు గాత్రంతో పాల్గొనగా, కామేశ్వర రావు, భానుహర్ష వయొలిన్ పైన, డాక్టర్ మండపాక రవి, సిహెచ్.శ్రీనివాస్, శివకుమార్, మహేశ్వర రావు, పేరి కామేష్ కుమార్ మృదంగం, కంజీరాలతో సహకరించారు. కాళ్ళ నిర్మల భాగవతారిణి నారాయణదాసుగారి కీర్తన గానం చేశారు. ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ఇక సాయంత్రం కార్యక్రమాలలో విద్యార్థుల లఘుకచేరీలు జరిగాయి. రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు ప్రఖ్యాత చిన్నపిల్లల వైద్యులు అయిన డాక్టర్ డి.వి. శ్రీకాంత్, వల్లీ, ఉసిరికల చంద్రశేఖర్ రావు, త్యాగరాజ సంగీత నృత్యకళాశాల అధ్యక్షులు లక్ష్మీరామదాసు, గురునారాయణ కళాపీఠం వ్యవస్థాపకులు బి.ఎ. నారాయణ, సద్గురు సంగీతాలయ ఉషాకామేశ్వరి, నారాయణమూర్తి, కాంభట్ల శ్రీధర్, రత్నం, టి.మహేశ్వర రావు, రోటేరియన్లు, సంగీతాభిమానులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఎంతో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

– డా. మండపాక రవి





# పిఠాపురంలో 7.1.25 న త్యాగరాజ ఆరాధన







హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో 7.1.26 తేదీ కొవ్వూరులో జరుగుతున్న శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈరోజు మొదటిరోజు కార్యక్రమం (లైవ్) గానం– శ్రీ J S శ్రీరామ్ (హైదరాబాద్) వయోలిన్: శ్రీ మహావాది వాసుశాస్త్రి (హైదరాబాద్) శ్రీ శ్రీధర్, మృదంగం: శ్రీ K యోగీష్ (రాజమహేంద్రవరం), మోర్సింగ్: శ్రీ T లక్ష్మీశంకర్ (ఏలూరు)

## శ్రీ సద్గురు సన్నిధి,రాజమండ్రి



శ్రీమతి మానేపల్లి సోమేశ్వరి విజయవాడ గాత్రసభకు
శ్రీ కొక్కొండ సుబ్బరాయన్, కాకినాడ వయొలిన్;
శ్రీకోటిపల్లి సూరిబాబు, కపిలేశ్వరపురం–మృదంగం.



ప్రముఖ నాట్యాచారిణి, నాట్యరత్న, గురుశ్రీ, విదూషి,
శ్రీమతి కె. రూప (విజయవాడ) గారి శిష్యబృందంచే
"కూచిపూడి నృత్య" ప్రదర్శన



ఏపీ భవన్ తరపున జరిగిన కార్యక్రమంలో
నాతో పాటు నా విద్యార్థులందరూ
రెసిడెన్స్ కమిషనర్
శ్రీ ప్రవీణ్ కుమార్ గారు
మరియు ఇతర ప్రముఖులతో

# ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ - విజయనగరం

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం మరియు రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో సద్గురు త్యాగరాజస్వామి 179వ ఆరాధన మరియు ఆదిభట్ల నారాయణ దాసుల 81వ దివ్యస్మరణ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల అర్చకులు ఇరువురి చిత్రపటాలకు హారతులు ఇవ్వగా ఉత్సవం ప్రారంభం అయ్యింది. శ్రీ జమ్ము అప్పన్న బృందం నాదస్వరంతో ప్రఖ్యాత వేణుగాన విద్వాంసులు మోడెకుర్తి కామేశ్వరరావు త్యాగరాజ విశేష వేషధారణతో కోట, గురాచారి వారి వీధి, మఠం వీధి, కానుకుర్తి వారి వీధి మీదుగా క్షేమగణపతి సన్నిధానం ఉత్తరాది మఠం, కానుకుర్తి వారి సత్రం వేదిక వరకు తిరువీధి జరిగింది. అర్చకులు భీమసేనాచార్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమం అనంతరం కార్యక్రమ సౌజన్యమూర్తి డాక్టర్ అయ్యగారి రాఘవరావు త్యాగరాజ జీవిత విశేషాలు తెలియజేయగా కార్యదర్శి మండపాక రవి నారాయణ దాసుగారి విశేషాలు తెలియజేశారు. స్థానిక విద్వాంసులు, విద్యార్థులచే డాక్టర్ కె.ఎ.పద్మప్రియ గారి నిర్వహణలో ఘనరాగ పంచరత్న కృతులు గోష్ఠి గానం జరిగింది. ఇందులో డాక్టర్ ఎం.ఎ.సుషమ, డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, ఇవటూరి మెహెర్లత, భానుమతి, భాస్కరరావు, సుభద్ర సుశీల, శారద, వోలేటి చంద్రిక శైలజ, అంకిత, గోడా శ్రీదేవి, శ్రీవల్లి, సుబ్బారావు, అకాడమీ విద్యార్థులు గాత్రంతో పాల్గొనగా, కామేశ్వర రావు, భానుహర్ష వయొలిన్ పైన, డాక్టర్ మండపాక రవి, సిహెచ్. శ్రీనివాస్, శివకుమార్, మహేశ్వర రావు, పేరి కామేష్ కుమార్ మృదంగం, కంజీరాలతో సహకరించారు. కాళ్ళ నిర్మల భాగవతారిణి నారాయణదాసుగారి కీర్తన గానం చేశారు. ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ఇక సాయంత్రం కార్యక్రమాలలో విద్యార్థుల, విద్యార్థుల లఘుకచేరీలు జరిగాయి.




**సంగీత సభానిర్వహకులు శ్రీ ఆనందమోహన్ గారి సంతాప సభ హైదరాబాద్ లోని సభలు సంయుక్తంగా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో2.2.26 హైదరాబాద్ లో జరిగింది.సంగీత విద్వాంసులు,అభిమానులు,కుటుంబ సభ్యులు వారి గొప్పదనాన్ని గుర్తుకు తెచ్చుకొని,పంచుకొని భాష్పాంజలి ఘటించారు.**

# శ్రీ శారదా సంగీత కళాసమితి - అనపర్తి వారి శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు.



2.1.26 శ్రీమతి తులసి విశ్వనాథ్ గాత్రం, కుమారి వి.నీరజ సహకారగానం, శ్రీపి.నందకుమార్, శ్రీ బి.సురేష్ బాబు సహకారాలు.



సన్మానం. 4.1.26న మరియు 5.1.26 న విద్వాన్ శ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ గారిచేత ఆధ్యాత్మికోపన్యాసం.



4.1.26 శ్రీ ఉమారామలింగేశ్వరవేదశాస్త్ర పరిషత్ 33వ వార్షిక ఉత్సవం సందర్భంగా ప్రముఖ వేదపండితుల చే వేదపారాయణం



8.1.26న విద్వాన్ మల్లాది సూరిబాబు గాత్రం డి.సాయిదీక్షితులు, ఎస్.ఆర్.వినయ్ సహకారగానం. శ్రీమావుదూరి సత్యనారాయణ శర్మ–వైలన్, శ్రీ మండపాక రవి–మృదంగం, శ్రీ సరస్వతుల హనుమంతరావు–ఘటం.



3.1.26న శ్రీమతి పురాణం విజయలక్ష్మిభాగవతారిణి హరికథ, శ్రీమహేంద్రవాడ నరసింహమూర్తి, శ్రీ కోటిపల్లి సూరిబాబు సహకారాలు



6.1.26న హైందవ జాగరణోద్యమ ధీరులు శ్రీ రాధామనోహరదాస్ గారి చే భగవద్గీత పై ప్రసంగం.



7.1.26న శ్రీకోట వెంకటలక్ష్మీనరసింహంగారిచే 'దేవీవైభవమ్' ఆధ్యాత్మిక ప్రవచనం.



7.1.26న మొదటగా శ్రీ సి.హెచ్.శేషగిరిరావు బృందం నాదస్వరం







శ్రీ శారదా సంగీత కళాసమితి వారి శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో 9.1.26 న నాట్యాచార్య వసంత కిరణ్ బృందం కూచిపూడి మరియు భరతనాట్య రీతుల నాట్యకార్యక్రమం.
నట్టువాంగం – వసంత్ కిరణ్, గాత్రం శ్రీమతి జి.అరుణ, వైలన్ శ్రీ ఎమ్.నీలాద్రిరావు, మృదంగం–శ్రీ ఎమ్.ఏడుకొండలు.

**శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవములు కార్యవర్గం : అధ్యక్షులు :** శ్రీ తమలంపూడి చిన ఆదిరెడ్డి గారు, **ఉపాధ్యక్షులు :** శ్రీ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి గారు, **కార్యదర్శి :** శ్రీ కొవ్వూరి రఘునాధరెడ్డిగారు, **కోశాధికారి :** శ్రీ నల్లమిల్లి వెంకట మునీశ్వరరెడ్డి గారు, **సహాయ కార్యదర్శి :** శ్రీ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (సక్కుగారు), **సహాయ కార్యదర్శి :** శ్రీ మారెళ్ళ శ్రీకృష్ణ ఫణీంద్ర గారు, **కార్యవర్గ సభ్యులు :** శ్రీ మిరియాల వీర్రాజుగారు, శ్రీ సత్తి రామారెడ్డి గారు (జి.బి.ఆర్), శ్రీ కొవ్వూరి వెంకటరెడ్డి గారు, శ్రీ పాలి ఆంజనేయులు గారు, శ్రీ కర్రరి శ్రీ చంద్రశేఖర రెడ్డి గారు, శ్రీ రెడ్డి సతీష్ గారు, శ్రీ నల్లమిల్లి తాతారెడ్డి గారు, శ్రీ కర్రి అశోక్ చక్రవర్తి గారు, శ్రీ కర్రి వెంకట రామకృష్ణారెడ్డిగారు, శ్రీ బచ్చు వీరవెంకటరమణ గారు, శ్రీ తాడి శ్రీనివాసరెడ్డి గారు (మెకానిక్ శ్రీను), శ్రీ లింగం వెంకటసత్య శ్రీనివాస ఫణికుమార్ గారు, శ్రీ తమలంపూడి వీర్రాఘవరెడ్డి గారు (గెడ్డం రాఘవ), శ్రీ చీకట్ల కృష్ణమూర్తి (బూరయ్య)గారు, శ్రీ కర్రి రామారెడ్డి గారు (మాణిక్యాంబ కిరాణా), శ్రీ డా. రెడ్డి రామమోహనరావు గారు, వెబ్ సైట్ నిర్వహణ, సహకారం : శ్రీ గొలుగూరి వెంకటరాధాకృష్ణారెడ్డి గారు.

## శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, గుంటూరు





17-01-2026 న గాయత్రీ సంగీత సన్మండలి గుంటూరి వారి ఆధ్వర్యంలో విద్వాన్ శ్రీ శశాంక్ సుబ్రహ్మణ్యం, చెన్నై వేణుగాన కచేరి ఈ సందర్భంగా శ్రీ శశాంక్ సుబ్రహ్మణ్యం గారిని సత్కరిస్తున్న సభా కార్యకర్తలు.

# శ్రీ శారదా సంగీతాలయం, నరసన్నపేట





శ్రీకాకుళం జిల్లా సంగీత లోకానికి పరిచయం అవసరం లేని పేరు పొన్నాన శ్రీరాములు నాయుడు వైలిన్ విద్వాంసులుగా ఆయన ప్రస్థానం అనన్య సామాన్యం. విద్వాంసునిగా ఎంత ఖ్యాతి గడించారో మంచి గురువుగానూ అంతే కీర్తిని గాంచారాయన. చిన్నతనంలోనే దృష్టిని కోల్పోయిన ఆయనను వారి పెద్దనాన్నగారైన పొన్నాన వీరన్నాయుడుగారు ఆయనకు ఒక జీవనాన్ని కల్పించాలన్న తలంపుతో సంగీత విద్యను అభ్యసింపజేయగా పట్టుదలతో తనకున్న శారీరక లోపాన్ని మనస్థైర్యంతో అధిగమించి, ఆ రోజుల్లోనే టెన్త్ మరియు విజయనగరం మహారాజా కాలేజీలో ద్వారం వారి శిష్యరికంలో వైలిన్ వాద్యంలో డిప్లమో పూర్తి చేసి, ఎన్ని ఉద్యోగ అవకాశాలు వచ్చినా తన విద్య తన స్వంత ప్రాంతాన్ని పరిమళింపజేయాలనే సదుద్దేశ్యంతో తిరిగి నరసన్నపేట చేరి 1974లో శ్రీ శారద సంగీత అకాడమీ స్థాపించారు. ఆనాటి నుండి ఎందరో విద్యార్థులకు సంగీత విద్యా దానం చేసి వారి జీవితాలను కళామయం చేశారు. ఆ విద్యతోనే తమ జీవనాన్ని సాగిస్తున్న వారు ఎందరో..

1976లో కర్ణాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరు సంగీతజ్ఞులందరికీ ఆరాధ్యులు అయిన శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలను విద్యార్థులు మరియు పురజనులు సహకారంతో శ్రీరాములునాయుడు గారు ప్రారంభించడం జరిగింది. అప్పటినుండి అది ఒక సంగీత యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. వర్ధమాన విద్వాంసుల నుండి ప్రఖ్యాతి చెందిన ఎందరో విద్వాంసులు ఈ ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్నవారే. 2020 నవంబర్ 12న శ్రీరాములనాయుడు గారు ఆ సంగీత సరస్వతి పాదాలను చేరగా వారి తర్వాత ఈ సంగీత సేవను ఆయన కుమార్తె అయిన శ్రీమతి పొన్నాన ప్రియంవద చేపట్టారు. చిన్నతనం నుండే తండ్రి ఒడిలో సరిగమలు నేర్చిన ఆమె సంగీతాన్ని తన వృత్తిగా, ప్రవృత్తిగా ఎంచుకున్నారు.శాస్త్రీయ,





లలిత, భక్తి సంగీతాలలో డిప్లమోలు, పీ.జీ చేసి, పీహెచ్డీ చేస్తూనే టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంగీత ఉపాధ్యాయునిగా స్థిరపడ్డారు. డాక్టర్ మండపాక శారద గారి వద్ద సంగీతములో మెళుకువలు నేర్చిన ఆమె చిన్నతనం నుండే తండ్రితో పాటు ఎన్నో సంగీత కచేరీలలో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నారు. భక్తి సంగీతంలో AIR B HIGH ఆర్టిస్టుగా గుర్తింపును పొందారు. తన తండ్రే తన గురువు, దైవం అయిన చేత ఆయన ప్రారంభించిన ఆ సంగీత యజ్ఞం ఎప్పుడు ప్రజ్వరిల్లుతూనే ఉండాలని, ఆయన ఆశయాలే పునాదిగా స్థాపించిన సంగీత పాఠశాల,ఒక ఆలయం అని తలచి 10. 12 .2020 న తన తల్లి అయిన శ్రీమతి పొన్నాన లక్ష్మి గారి అనుమతితో, ఆమె అధ్యక్షతన,తన భర్త అయిన టి.బ్రహ్మాజీ మరియు మరికొందరు శ్రేయోభిలాషుల సహకారంతో శ్రీ శారద సంగీతాలయం గా చేసి తన తండ్రి మరియు గురువునకు నివాళి అర్పించారు. తన తండ్రిగారు ఎంతో భక్తి శ్రద్ధలతో చేసే త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ఆయన వారసురాలిగా ప్రియంవద కూడా నిర్విరామంగా కొనసాగించడం ఎంతో అభినందనీయం. శ్రీ శారదా సంగీతాలయంలో ఆమె శిక్షణలో ఎందరో విద్యార్థులు సంగీత విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో నేరుగానే కాక అంతర్జాలం ద్వారా కూడా సంగీత విద్యావ్యాప్తి జరుగుతుండడం ఎంతో ముదావహం. ఇక్కడ నేర్చుకుంటున్న విద్యార్థులు అనతికాలంలోనే సంగీతంలోమంచినైపుణ్యాన్నికనబరచడంగమనార్హం. తమ సంగీతాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంతో శ్రద్ధగా విద్యను అభ్యసిస్తూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సంగీత ప్రదర్శనలు ఇస్తున్నారని, ఈ మధ్యనే ఆకాశవాణి విశాఖపట్నం వారు నిర్వహించిన ఆడిషన్స్ లో 'నామ సంకీర్తనం' విభాగంలో తమ సంగీతాలయ విద్యార్థి బృందం (బి నాగేశ్వరి, బి కల్పన,కె వైకుంఠరావు,వి నీరజ, డి పూర్ణిమ,ఎస్



జయలక్ష్మి) గ్రేడ్ సంపాదించగా, లలిత సంగీతంలో మరొక విద్యార్థిని వి నీరజ ఆకాశవాణి గుర్తింపును పొందింది. చిన్నారి బి శ్రీ రిధి విజయనగరం రోటరీ క్లబ్ వారు నిర్వహించిన పోటీలలో శాస్త్రీయ ,భక్తి సంగీతాలలో ప్రథమ,ద్వితీయ బహుమతులు పొందగా ,మరొక చిన్నారి పి స్నేహిత ప్రఖ్యాత సంగీత విద్వన్మణి పద్మభూషణ్ డాక్టర్ సుధా రఘునాథన్ గారి సంస్థ అయిన సుధార్ణవం నిర్వహించే 'శ్రావ్య సీజన్ 6' లో పాల్గొని వేల మందితో పోటీపడి ఫైనల్ కు చేరి ఈ నెలలో జరగనున్న చివరి అంకంలో తలపడనుంది.



ప్రత్యేక సంగీత కార్యక్రమంగా.. శ్రీమతి గుత్తుల అరుణ గారి సంగీత కచేరి. ఈ కచేరీలో శ్రీమతి అరుణ వనజాక్షి – కళ్యాణి వర్ణంతో ప్రారంభించి గిరిరాజసుతా తనయ, జ్ఞానమొసగరాదా, చక్కనిరాజ మార్గము యుండగా, ఎవరురా నిను వినా, శరశర సమరైక శూర, వందనము రఘునందన అంశాలు ప్రతిభావంతంగా వినిపించి మెప్పు పొందారు. శ్రీ యం. సత్యనారాయణ శర్మ, శ్రీ యం. ప్రసాదరావు వయోలిన్, మృందగాలపై సహకరించి రక్తివంతం చేసారు.

## "స్వరతరంగిణి" ఆధ్వర్యంలో కుమారి సిడింబి సాత్విక గాత్ర కచేరీ




18-1-2026 నాడు బెజవాడ సత్య నారాయణపురంలో శ్రీ గాయత్రి కన్వెన్షన్ హాల్ లో "స్వరతరంగిణి" ఆధ్వర్యంలో కుమారి సిడింబి సాత్విక గాత్ర కచేరీ రసరమ్యంగా జరిగింది. ఈ చిరంజీవి కేఎల్ విశ్వవిద్యాలయంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ, శ్రీమతి అంజన వద్దసంగీతం నేర్చుకొని, ప్రస్తుతం మోదుమూడి సుధాకర్ దగ్గర తర్ఫీదు పొందుతున్నది.

**సహకారవాద్యాలు:**

శ్రీ BVS శ్రీకృష్ణ- వయోలిన్ శ్రీ CH. సూర్య- మృదంగం యువతను ప్రోత్సహిస్తున్న స్వరతరంగిణి సభ వారికి, ప్రత్యేకించి వయోలిన్ విద్వాన్ శ్రీ గందూరి శ్రీనివాస మూర్తి గారికి అభివందనం

**చిరంజీవి సాత్విక పాడిన అంశాలు:**

నళినకాంతి వర్ణం –మైసూర్ వాసుదేవాచార్య, పంచమాతంగ ముఖ- మలహరి- దీక్షితార్, క్షీర సాగర శయన - దేవగాంధారి- త్యాగయ్య, కద్దనువారికి కద్దు - తోడి- త్యాగయ్య, కరుణ జూడు- శ్రీ- శ్యామశాస్త్రి, అమ్మరావమ్మా - కల్యాణి- త్యాగయ్య, కరుణింపవే నను –రాగమాలిక- M సుధాకర్

పురందరదాసు కీర్తన- సుచరిత్ర రాగం పంచాక్షరీ పరమ మంత్రమ్ము- ఆభేరి- సామవేదం షణ్ముఖ శర్మ గారు ద్విజావంతి రాగంలో బాలమురళి గారి తిల్లానా మంగళం

# ఆక్స్ ఫర్డ్ హైస్కూల్ ,జమ్మికుంట, హనుమకొండలో త్యాగరాజ ఆరాధన.20.1.26.










# హరికథా కళాప్రపూర్ణుడు అమ్ముల విశ్వనాథుడు





హరికథా కళాకోవిద, హరికథక రాజహంస, కళా ప్రపూర్ణ డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ స్మారక పురస్కారాన్ని హరికథా చూడామణి పురాణం విజయలక్ష్మి భాగవతారిణికి పదివేల రూపాయల నగదుతో అమ్ముల వారి కుటుంబ సభ్యులు అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. అమ్ముల స్మారక సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాల కళావేదికపై విశ్వనాథ భాగవతార్ 110వ జయంతి సభ జరిగింది. పురస్కార ప్రదాన సభకు అధ్యక్షునిగా గోళ్ళ నారాయణరావు, ముఖ్య అతిథిగా సంగీత చక్రవర్తి మల్లాది రవికుమార్, ఆత్మీయ అతిథులుగా ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ జివి పూర్ణచంద్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఎంసీదాస్ తదితరులు




మాట్లాడుతూ తెలుగు నాట వర్ధిల్లిన హరికథ కళకు ఆరాధ్యుడు ఆదిభట్లాన్వయుని సంప్రదాయాన్ని యధాతథంగా కొనసాగిస్తూ, హరికథ కళను ఉపాసించి, శ్వాసగా చేసుకొని వృత్తిపై భక్తిని కలిగి తెలుగు హరికథ ఉత్కృష్టతను రాష్ట్రపతుల సమక్షంలో చాటిన ఘనత హరికథా గాన కళాప్రపూర్ణుడు అమ్ముల విశ్వనాథునికి దక్కిందన్నారు. హరికథ కళకు అవసరమైనవన్నీ నిండుగా కలిగిన భాగవతవర్యులు అమ్ములవారని, హరికథకునకు బహు గ్రంథ పఠనం తప్పనిసరి అని అమ్ముల వారి హరికథ తెలుపుతుందన్నారు. ఆయన పేరిట పురస్కారాన్ని కుటుంబ సభ్యులు ప్రతి ఏటా పలువురు ప్రముఖ హరికథకులకు ప్రదానం చేయటం ఎంతో సముచితమన్నారు.కార్యక్రమాన్నిఅమ్ములవారితనయి బివి దుర్గాభవాని, శ్రీసతీష్ తదితరులు నిర్వహించారు. భక్తిరసప్లావితం విజయలక్ష్మి హరికథా గానం అదే వేదికపై పురస్కార గ్రహీత పురాణం విజయలక్ష్మి భాగవతారిణి హరికథా గానం భక్తిరసప్లావితంగా సాగింది. వీరికి వయోలిన్తో కూరపాటి సుబ్రహ్మణ్యరాజు, మృదంగంతో ఆసూరి లక్ష్మీనారాయణలు నిండుగా సహకరించారు.

# సభక్తికంగా పురందర దాస ఆరాధన





ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం నిర్వహణలో మఠం వీధిలో గల సర్ వేణుగోపాలస్వామి మఠంలో కర్ణాటక సంగీత పితామహులు అయిన పురందర దాసుల ఆరాధన సభక్తికంగా జరిగింది. ముందుగా అర్చకులు హృషికేశాచార్య వేదోక్తంగా ఆరాధన పూజ, ఉపచారాలు నిర్వహించారు. అనంతరం కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కె .సుబ్బారావు,



సుధాకర్ కాళ్ళ నిర్మల తదితరులు పురందర దాసుల చిత్రపటానికి పూలమాలలు వేసి హారతులు ఇవ్వగా సంగీత కచేరీలు ప్రారంభం అయ్యాయి గాత్ర కచేరీలు చేసిన సుబ్బారావు భానుమతి, సుశీల, శారదాద్వయం, శ్రీవల్లి, సుబ్బారావు, ఆలపించగా వయొలిన్ పై ఎం. ఈశ్వరమ్మ, భానుహర్ష సహకరించగా, డాక్టర్ మండపాక రవి, మహేశ్వర రావు, మృదంగములపై సహకరించారు. సభ్యులు సంగీతాభిమానులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఎంతో అత్యంత బాగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ధన్వాడ రమణరావు స్మృత్యర్థం వారి కుమారులు సుధాకర్ సమర్పించారు.

**– డాక్టర్ మండపాక రవి**



**12.2.2026 న మంథని ప్రభుత్వ సంగీత పాఠశాల లో జరిగిన శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం**

# శ్రీ త్యాగరాజస్వామి వారి 38వ వార్షిక సంగీత ఆరాధనోత్సవములు, సరిపల్లె




17-12-25న శ్రీ అయ్యగారి సత్యప్రసాద్ వీణ కచేరి



శ్రీ ఆచంట లక్ష్మీశ్రీనివాస్ బృందం నామసంకీర్తన



శ్రీమతి అనపిండి రేవతి గాత్రం



శ్రీమతి ద్రోణంరాజు వెంకటరమణ సీత గాత్రం



శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గాత్రం



చిరంజీవి కూరెళ్ల కార్తికేయ కీబోర్డు

**ఈ సభ కార్యదర్శి శ్రీ సురేష్ గారు సాంప్రదాయాన్ని కాపాడుతు సభను నిర్వహిస్తున్నారు. వారికిఅభినందనలు**



**సంగీత లహరి,రాజమండ్రి లో గాయని శ్రీమతి తులసి విశ్వనాథ్ గారికి 22.2.26 న సత్కారం**

# సంగీత లహరి, రాజమహేంద్రవరం నెలవారి సంగీత సభ 15 వ వార్షికోత్సవం

సంగీత లహరి నెలవారి సంగీత సభ 15 వ వార్షికోత్సవం జనవరి 23 24 మరియు 25 తేదీలలో ఘనంగా జరిగాయి.



మొదటి రోజు ప్రఖ్యాత వైయలిన్ విద్వాంసులు శ్రీ ఉప ద్రష్ట శ్రీ హరి ప్రసాద్ గాత్ర కచ్చేరి జరిగింది వీరికి వైయలిన్ పై కొక్కొండ తారక సుబ్బారాయన్ గారు మృదంగం పై అనపిండి కామేశ్వర్ రావు గారు సహకరించారు.

హరిప్రసాద్ గారు తమ కార్యక్రమాన్ని "జయ జయ స్వామిన్ జయ జయ" అనే నాట రాగ కీర్తనతో ప్రారంభించి, అనేక వాగ్గేయకారుల రచనలను గానం చేశారు. ఉప ముఖ్యాంశంగా హంసానంది రాగం లోని స్వాతి తిరునాళ్ల వారి రచన "పాహి జగజ్జనని" అనే కీర్తన పాడారు. ముఖ్యాంశం గా వీరు పాడిన మధ్యమావతి రాగం లోని "పాలించు కామాక్షి పావని" అంశములో చేసిన స్వర విన్యాసము శ్రోతలను ఆనంద పరవశులను చేసింది. సుబ్బారాయన్ గారు వాయించిన మధ్యమావతి రాగాలాపన వారి విద్వత్తుకు మచ్చు తునక. కామేశ్వర రావు గారు తని అద్భుతమైన రీతిలో సాగింది.

అనంతరం హరిప్రసాద్ గారు రెండు మూడు అన్నమయ్య పురందర దాసుల కీర్తనలు పాడారు.




రెండవ రోజు కార్యక్రమం గా హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీమతి మృదుల గారి వీణ కచేరి జరిగింది. వీరు కీ ॥శే పప్పు సోమేశ్వర్ రావు గారి శిష్యులు. నాటకురంజి రాగ వర్ణం తో ప్రారంభించి మంచి మంచి కీర్తనలు చాలా హృద్యం గా వాయించారు. ముఖ్యం గా వీరు వాయించిన తోడి రాగ అలాపన మరియు "కద్దను వారికి" కీర్తన శ్రోతల మన్నన్న లు అందుకొంది. మృదంగం పై సహకరించిన పి. విద్యాసాగర్ గారు వీణావాయిద్యానికి అడ్డు రాకుండా అద్భుతంగా సహకరించారు. తిరుపతి వాస్తవ్యులు శ్రీ మారుతీ రఘురామ్ ఘటం పై సహకరించారు. సాగర్ మరియు మారుతి గారల తని మంచి విన్యాసం తో ఉండి శ్రోతలను ఆనంద పరిచింది.



వార్షికోత్సవాలలో చివరి రోజున సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవం వైభవం గా ఉదయం 6 గం నుండి రాత్రి 9 30 వరకు జరిగింది. ఉదయం నగర సంకీర్తన అనంతరం 10 నుండి 11 వరకు పంచరత్న సేవ కడు వైభవం గా జరిగింది. రాజమండ్రి కళాకారులందరు పాల్గొని ఉత్సవ శోభని ద్విగుణీకృతం చేశారు. రాత్రి 9 గం.లకు ఆంజనేయ ఉత్సవం తో కార్యక్రమం పరిసమాప్తి అయ్యింది.













# సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనసొసైటి, తణుకు.

## 87వ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు 23.1.26 నుండి 29.1.26 వరకు జయప్రదంగా జరిగాయి.








# వీనులవిందుగా ద్వారం లక్ష్మి గాత్ర సంగీతం



శ్రీసద్గురు సన్నిధి నెలవారీ శాస్త్రీయ సంగీత, నృత్య సభ కార్య క్రమం గోదావరి గట్టున ఉన్న శ్రీత్యాగ రాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. తిరుపతికి చెందిన ద్వారం లక్ష్మి గాత్ర సంగీతానికి విజయనగరానికి చెందిన హను మంతు రామ్చరణ్ వయోలిన్, విజయవాడకు చెందిన సద్గురు చరణ్ మృదంగం, తాడేపల్లిగూడేనికి చెందిన యస్. హనుమంతరావు ఘటం, ఆముదాలవలసకు చెందిన బి. దుర్గా శ్రీనివాసశర్మ మోర్సింగ్పై వాద్య సహ కారం అందించారు. పలువురు సంగీతాభిమానులు హాజరయ్యారు.

# పీఠికాపుర కళావేదికపై... సుందోప సుంద కలహ

## అలరించిన కర్ణాటక సాంప్రదాయ జానపద నృత్య రూపకం



శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య, పిఠాపురం వారి ఆధ్వర్యంలో... పీఠికాపుర కళావేదికపై కర్ణాటక సాంప్రదాయ జానపద నృత్య రూపకం యక్షగానంలో 'సుందోపసుంద కలహ' చక్కగా అభినయించి ప్రేక్షకులను మెప్పించారు. సుందోపసుంద కలహ షోనితావురని పరిపాలించే నికుంభుడనే రాక్షస రాజుకి సుంద మరియు ఉపసుంద అనే ఇద్దరు కుమారులున్నారు. వారు చాల సన్నిహితంగా ఉండే అన్నదమ్ములు. వారిద్దరు కలిపి బ్రహ్మ దేవునికి తపస్సు చేసి ఒక వరాన్ని సంపాదించారు. వారిరువురి మధ్య గొడవ వచ్చి వాళ్ళకు వాళ్ళే చంపుకుంటే తప్ప ఎవరివల్ల చావు లేకుండా ఉండేటట్లు వరాన్ని పొందారు. ఈ వరంయొక్క బలంతో రాజులందరిని ఓడించి, దేవలోకంతో సహా రాజ్యాలను స్వాధీనపరచుకున్నారు. వారిని ఎవ్వరూ ఆవలేక పోయారు. చివరికి నారాయణుడు వారిని ఎదుర్కోగా వర ప్రభావం వలన ఓడించలేక పోయాడు. వారిని సంహరించడానికి నారాయణుడు అతిలోక సుందరియైన దేవతా కన్య తిలోత్తమను శృష్టించాడు. సుందోవ సుందులిద్దరు తిలోత్తమను చూసి ఆకర్షితులై... నాకు మాత్రమే ఈ అందాల రాశి సొంతం కావాలని అనుకోవడంతో వారిద్దరి అసూయ ద్వేషాలు పెరిగాయి. అన్నదమ్ముల అనుబంధాన్ని మరచిపోయి ఒకరినొకరు ఒకరినొకరు చంపుకోవడం జరిగింది. వరాన్ని పొందిన ప్రకారం వారి వినాశనానికి వారే కారణమయ్యారు. నీతి : అత్యాశ, అసూయ, వ్యామోహం విడరాని బంధాన్ని కూడా నాశనం చేస్తుంది.

సుందుడుగా నిరంజన్, ఉవసుందడుగా ప్రవీణ్ హెగ్డే, విష్ణువుగా మంజునాధ్ హెగ్డే, తిలోత్తమగా మల్లిక రాఘవేంద్ర చక్కగా నర్తించారు. భాగవతార్ పరమేశ్వర్ హెగ్డే, మద్దెల శ్రీ పాద భట్, చండె ఉమేశ్ హెగ్డే చక్కటి సహకారాన్ని అందించారు. అధిక సంఖ్యలో నాట్య ప్రియులు హాజరైనారు



సుబ్రహ్మణ్యమహతి సంగీత సభ లో
డా. డి.దుర్గాప్రసాద్, కుమార్తె వీణాధరి,
విశాఖ వీణావాదనం.

# సరస్వతీ గానసభ122 వ సంవత్సర వేడుక గా శ్రీ త్యాగరాజ ఆరాధన






సరస్వతీ గానసభ122 వ సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా వారి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుండి పాల్గొన్న 500మంది కళాకారులతో కాకినాడ ఆనందభారతి గ్రౌండ్ లో జరిగినజరిగిన సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధన.. ప్రవచన రాజహంస గౌరవశ్రీ చాగంటి కోటేశ్వరరావు త్యాగరాజు జీవిత విశేషాలపై ప్రసంగించారు. అనంతరం విద్వాన్ శ్రీ మొదుమూడి సుధాకర్ నిర్వహణలో త్యాగరాజ పంచరత్న కీర్తనల బృందగానం జరిగింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే గౌ.శ్రీ వనమాడి వెంకటేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభం చేశారు. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాలకు తమ ప్రోత్సాహం ఎల్ల వేళలా వుంటుందని తెలిపారు. కార్యక్రమం ఆసాంతం వుండి ప్రసాదం స్వీకరించి వెళ్లారు. సభ సభ్యులందరూ పాల్గొన్నారు.

పద్మశ్రీ డా.శ్రీ యల్లా వెంకటేశ్వర రావు, శ్రీ మోదుమూడి సుధాకర్, శ్రీ మల్లాది నారాయణ శర్మ, శ్రీ PV శేషయ్య శాస్త్రి, శ్రీ పోపూరి గౌరీనాథ్, డా. శ్రీ ద్వారం త్యాగరాజు, శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు, శ్రీ యల్లా బాల మురళీ, శ్రీ M కాంతి స్వరూప్, శ్రీ యల్లా వెంకటేశ్, శ్రీ BV విద్యాసాగర్, శ్రీ ఆకొండి వెంకట్రావు, శ్రీ EV కృష్ణమాచార్యులు, శ్రీ సాయి చరణ్, శ్రీమతి పెద్దాడ సూర్య కుమారి, శ్రీమతి శారదా సుబ్రహ్మణ్యం, శ్రీమతి గౌరీ రామ్మోహన్, శ్రీమతి లలితా చంద్రశేఖర్, శ్రీమతి VL తులసీనాథ్, శ్రీమతి M. అంజన, శ్రీమతి Dr Y రమాప్రభ, శ్రీమతి పుష్పా రామ్మోహన్, శ్రీమతి చిలుకూరి సుబ్బలక్ష్మి, శ్రీమతి చావలి సూర్య కుమారి, శ్రీమతి G.అరుణ, శ్రీమతి B రూపా శాస్త్రి, శ్రీమతి M లలిత, శ్రీమతి K.శారదా దేవి, శ్రీమతి A గీతా దేవి, శ్రీమతి B శ్రావణి, K నిఖిత, K ఇషిత, శ్రీమతి ఇవటూరి హరిణి, చాగంటి సాహితి, శ్రీమతి శ్రీవిద్య, శ్రీమతి విద్యశ్రీ, లలిత (తిరుపతి), శ్రీవైష్ణవి (తిరుపతి), శ్రీమతి శేషు రాణి, శ్రీ M హరిబాబు, శ్రీ సరస్వతుల హనుమంత రావు, శ్రీ A అనిల్, శ్రీ సాయి సోమ శేఖర్, శ్రీ బంకుపల్లి దుర్గా శ్రీనివాస శర్మ, శ్రీ పాలపర్తి నాగేశ్వరరావు, శ్రీ మవుదూరి సత్యనారాయణ, శ్రీమతి BV దుర్గాభవాని, శ్రీ M నీలాద్రి రావు, శ్రీ H రామచరణ్, శ్రీ U శ్రీహరి

ప్రసాద్, శ్రీ విష్ణుభొట్ల శ్రీరామచంద్ర మూర్తి, శ్రీ మహేంద్రవాడ నరసింహ మూర్తి, శ్రీ వీరా శివ ప్రసాద్, శ్రీ పప్పు జ్ఞానదేవ్, శ్రీ పేరి త్యాగరాజు, శ్రీ చావలి శ్రీనివాస్, శ్రీ D నగేష్ బాబు, శ్రీ B రవికిరణ్, శ్రీ కొక్కొండ సూర్య సుబ్రహ్మణ్యం, శ్రీమతి రేపాక సుధ, శ్రీ మండ అనంత కృష్ణ–వేణువు, శ్రీ BVS శర్మ–వేణువు, శ్రీ అభిషేక్, శ్రీ చల్లపల్లి లక్ష్మీ నారాయణ, శ్రీ P జయ భాస్కర్, శ్రీ K.సద్గురు చరణ్, శ్రీ NS కళ్యాణ రామన్, శ్రీ K యోగీష్, శ్రీ మహాదాసు ఏడు కొండలు, శ్రీ మంగళగిరి శ్రీధర్, శ్రీ B సురేష్ బాబు, శ్రీ చావలి కృష్ణ మోహన్, శ్రీ వారణాసి శ్రీనివాస్, శ్రీ D వెంకటరావు, శ్రీ జటా శ్రీనుబాబు, శ్రీ ధన్వాడ ధర్మారావు, శ్రీ రవికుమార్, శ్రీ కాశీ ప్రసాద్, శ్రీ ఆకొండి వెంకట్రావు & టీం (వైజాగ్) – 100, శ్రీ విష్ణుభొట్ల వారు & టీం (కాకినాడ) – 70, శ్రీమతి పెద్దాడ సూర్య కుమారి & టీం (కాకినాడ)–50, శ్రీమతి చావలి సూర్య కుమారి & టీం (కాకినాడ) – 15, సత్కళా వాహిని & టీం (కాకినాడ) – 28, శ్రీమతి Y రమాప్రభ & టీం (హైదరాబాద్)–28, శ్రీ నరసింహ మూర్తి & టీం (ఇంజరం) – 6, శ్రీమతి వింజమూరి గాయత్రి & టీం (పిఠాపురం) – 11, సరస్వతీ గానసభ స్కూల్ – రాధ & టీం (కాకినాడ)–20, శ్రీమతి ఇంద్రగంటి పద్మజ & టీం (అన్నవరం) – 5, శ్రీమతి కొమ్మూరి రాజేశ్వరి & టీం (హైదరాబాద్) – 10, శ్రీ సుబ్బరాయ శాస్త్రి & టీం (పిఠాపురం) – 8, శ్రీమతి మల్లాది విజయలక్ష్మి & టీం (హైదరాబాద్) – 10, శ్రీ మోదుమూడి సుధాకర్ & టీం (విజయవాడ) – 3


















## సంగీత విద్వత్ సభ, కాకినాడ 2026 సంగీత పోటీల విజేతలు

**సంగీత పోటీల విజేతలు**

**గాత్రం జూనియర్స్ :**

1. డి.వి.కె. మనస్విని, హైదరాబాద్ – మొదటి బహుమతి రూ. 2000/–, 2. ఎ. లీలా కౌశిక్, విజయవాడ – రెండవ బహుమతి రూ. 1500/–, 3. కె. భార్గవి షణ్ముఖ శ్రీనివాస్, కాకినాడ – 3వ బహుమతి రూ. 1000/–

**గాత్రం సీనియర్స్ :**

1. యం. ధృతి శ్రీపద, విశాఖపట్నం – 2వ బహుమతి రూ. 3000/–

**వీణ జూనియర్స్ :**

1. ఈ. లక్ష్మీ కృష్ణ, కాకినాడ – 1వ బహుమతి రూ.2000/–, 2. డి.వి.కె. మనస్విని, హైదరాబాద్ – 2వ బహుమతి రూ. 1500/–, 3. బి. అనన్య, విశాఖపట్నం –3వ బహుమతి రూ. 1000/–

**వీణ సీనియర్స్ :**

వి. హర్షిణి, హైదరాబాద్ – 2వ బహుమతి రూ. 3000/–

**ఫ్లూట్ మరియు వయోలిన్ (జూనియర్స్) :**

కె. సాయిరామ్, కాకినాడ – 1వ బహుమతి రూ. 2,000/–, ఎ. లీలా కౌశిక్, విజయవాడ – 2వ బహుమతి రూ. 1500/–, వై. త్ర్యక్ష, విజయవాడ – 3వ బహుమతి రూ. 1000/–

**ఫ్లూట్ మరియు వయోలిన్ (సీనియర్స్) :**

యం. కల్యాణ్ శశాంక్, విశాఖపట్నం – 2వ బహుమతి రూ. 3000/–

**న్యాయ నిర్ణేతలు :** విద్వాన్ శ్రీ ద్విభాష్యం నగేష్ బాబు, విద్వాన్ శ్రీ ఎన్. అబ్దుల్ రెహమాన్.

# సరస్వతీ గానసభ, కాకినాడ

సరస్వతీ గానసభ, కాకినాడ వారి రెండవ విడత దసరా సంగీతోత్సవాలు. ఫిబ్రవరి6,7,8 తేదీల్లో కాకినాడ సూర్యకళామందిరంలో జరిగాయి.

1. 6న పండిత్ జయతీర్థ మెవొండి-హిందుస్థాని సంగీతం.

2.7న శ్రీరామపాద భాగవతార్ బృందం-భజరే గోపాలం నామసంకీర్తన,

3.భూతకాలం నాటకం (గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్. రచన-దివాకర్ బాబు మాడభూషి; దర్శకత్వం-డా. వెంకట్ గోవాడ).



122వ సంగీత, నృత్య నాటకోత్సవాలలో రెండవ విడత, మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా...మొదటిరోజున అనగా ది. 06-02-2026, శుక్రవారంనాడు పండిట్ జయతీర్థ మేవుండి (హుబ్బళి) గారి హిందుస్థానీ గాత్ర సంగీత కచేరీ జరిగింది.

ముందుగా సభాధ్యక్షులు డా.ముళ్ళపూడి నాగేశ్వరరావుగారు స్వాగతం పలికారు. జ్యోతి ప్రకాశనం జరిగిన తరువాత కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ కళాకారులను సభకు పరిచయం చేశారు.

హిందూస్థానీ శాస్త్రీయ సంగీత కచేరీలు మన శ్రోతలకు అంతగా అలవాటు లేకపోయినా, నిన్న జరిగిన కచేరీని శ్రోతలు ఆద్యంతం ఆసక్తిగా విని, ఆనందపరవశులై, కాకినాడ శ్రోతల రస హృదయాలను వెల్లడించారు.

నాదబ్రహ్మ తత్త్వాన్ని స్వర రూపంలో ఆవిష్కరించిన మహోన్నత కళాకారుడైన మేవుండిగారి సంగీతంలోని గాంభీర్యం, భావ వ్యక్తీకరణ శ్రోతల హృదయాలలో మాధుర్యం నింపింది.

ఖయాల్ గానశైలిలోని రాగ భావాల లోతును, భక్తి,భావ రసాలను అలరించేలా వారు మొదట రాగ్ యమన్‌లో,తరవాతజోగ్‌రాగంలోనూఆలపించారు. అనంతరం పహాడీ రాగంలో "జమునా కినారే" అనే ఠుమ్రీని వినిపించారు. ఆ తర్వాత మేవుండిగారు తాము అయోధ్యలో గానం చేసిన "రామ అవధపురి" అనే కీర్తనను శివ్ అభోగి రాగంలో భక్తి పూర్వకంగా గానం చేశారు. ఇంకా మాల్కౌజ్ రాగంలో ఆయన అద్భుతంగా వినిపించిన ఠుమ్రీ, "ఆజ్ మోరే ఘర్ ఆయేన బల్ మా" అనే ఛోటా ఖయాల్ అద్భుతంగా ఆలపించారు. ఆ తరువాత అహీర్ భైరవ్ రాగంలో మేవుండిగారు "విఠల విఠల తీర్థ విఠల" అనే మరాఠీ అభంగ్ ను ఆలపించి, శ్రోతలను జయతీర్థ సాగరంలో స్నానమాడించారు. తరువాతి అంశంగా భైరవి

రాగంలో ఒక కన్నడ కీర్తననూ, చివరగా బసంత్ రాగంలో ఎంతో ప్రసిద్ధి పొందిన వారు 'ఫగ్వా బ్రిజ్ దేఖన్ కో ఛలోరీ' అనే కీర్తనను పాడి శ్రోతల హర్షధ్వానాల మధ్య కచేరీని ముగించారు.



రెండవ రోజైన ది. 07-02-2026, శనివారం నాడు స్థానిక సూర్యకళా మందిరంలో శ్రీరామపాద భాగవతార్ మరియు వారి బృందంచే నామ సంకీర్తనం కార్యక్రమం జరిగింది.

తెలుగువారైన శ్రీరామపాద భాగవతార్ చెన్నై కేంద్రంగా 'నాదోపాసన సంస్థాన్' అనే సంస్థను ఏర్పాటు చేసి, తమ బృందంతో 'భజరే గోపాలం' అనే పేరిట నామ సంకీర్తనం చేస్తూ గత 16 సంవత్సరాలుగా భక్తిని, భారతీయ సనాతన ధర్మాన్ని , సంస్కృతినీ, సంగీతాన్ని ప్రచారం చేయడంలో ముఖ్యమైన భూమికని నిర్వహిస్తున్నారు.

శ్రీరామపాద భాగవతార్ విఘ్నేశ్వరుడు, శంకరులు, దత్తాత్రేయ స్వామి, శ్రీరాముడు, శ్రీ కృష్ణుడు, పరమ శివుడు, అమ్మవారు మొదలైన వారందర్నీ స్తుతిస్తూ భక్తి ప్రపత్తులతో సంకీర్తనం చేశారు. వారు తమ బృందంతో ఆలపించిన 'కాలడి వాసా శంకర గురో', 'చంద్రచూడ శివ శంకర..' అనే పురందర దాసులవారి కీర్తన, 'రామరామ యనరాదా రఘుపతి...' అనే ప్రయాగ రంగదాసుగారి కీర్తన, 'సీతాపతి రామచంద్రకీ' అనే కబీర్ భజన్, 'శరణు శరణు సురేంద్ర సన్నుత' అనే అన్నమాచార్యుల కీర్తన శ్రోతలను భక్తి పరవశులను చేశాయి.

ఈ బృందంలో వారి అర్ధాంగి శ్రీమతి ప్రభ, శ్రీ గోకుల్, శ్రీ హరిహరన్ సహకార గాత్రం అందించారు. హార్మోనియంపై శ్రీ సుబ్బారావు, మృదంగంపై శ్రీ మణివణ్ణన్, శ్రీ బాలాజీ గారలు సహకరించారు.

భక్తిరస ప్రపూరితమైన ఈ నామ సంకీర్తనం శ్రోతలను ఎంతగానో ఆనందింపచేసింది.



మూడవ రోజు (ది.08-02-2026, ఆదివారం) సాయంకాలం 'భూతకాలం' అనే నాటకాన్ని గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించారు. ప్రముఖ సినీ రచయిత శ్రీ మాడభూషి దివాకరబాబు ఈ నాటకాన్ని రచించారు శ్రీ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు

ఆధునిక నాటక పరిణామ క్రమంలో చోటుచేసుకుంటున్న ప్రక్రియలను, సాంకేతి

కతను ఈనాటి రచయితలు, దర్శకులు అందిపుచ్చుకుంటున్నారనేదానికి ఈ నాటక ప్రదర్శన ఒక ఉదాహరణ.

ఈ నాటకంలో రచయిత కొన్ని పాత్రలకు భూతాలను ప్రతీకాత్మ కంగా తీసుకున్నారు. మనిషిలోని అత్యాశ, మోసం, అధిక ధనాపేక్ష మొదలైన దుర్గుణాలే భూతాలని, అలాగే మనిషిలోని నిష్కపటత్వం, ధైర్యం , శ్రమించడం వంటివి భగవంతుని రూపాలని చెప్పడమే ఈ నాటకంయొక్క ముఖ్యోద్దేశం. భగవంతుడు ఏ మనిషికి ఏమివ్వాలో, ఎంత ఇవ్వాలో అంతా సరిగ్గానే ఇస్తాడు. వాటిని మించి అతిగా కోరుకుని వాటికోసం పరుగులు పెడుతూ, మోసాలు చేస్తూ బతికేవాడు భంగపడక తప్పదు. కనుక భూత కాలం ను వదిలిపెట్టి, వర్తమానంలో బ్రతుకుతూ, శ్రమిస్తూ చక్కని భవిష్యత్తు కోసం పాటు పడాలి! అనే సందేశాన్ని ఇచ్చే నాటకం ఇది.

నాటకంలోని నటీ నటులందరూ బాగా నటించారు. ముఖ్యంగా ఆహార్యం, సంగీతం నాటకానికి బలాన్నిచ్చాయి.

ఈనాటితో మూడు రోజులపాటు జరిగిన రెండవ విడత వార్షిక కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తి అయ్యాయి.

ఈ సందర్భంగా, కార్యక్రమాలకు విచ్చేసి, విజయవంతం చేసిన ప్రేక్షకులకందరికీ సరస్వతీగానసభ పక్షాన కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు నిర్వాహకులు.

–సి.ఎస్. (చెరుకువాడ సత్యనారాయణ)

# శ్రద్ధాంజలి.



ప్రముఖ సంగీత విద్వాంసులు, సంగీతసభా నిర్వహకులు


## శ్రీ వి.ఆనందమోహన్

**26.1.2026 సోమవారం రాత్రి హైదరాబాద్ లో పరమపదించారు.**
**వారికి గానకళ నివాళులు అర్పిస్తున్నది.**

# 11వ హైదరాబాద్ త్యాగరాజ ఆరాధనోత్సవం (HTAMF 2026)









జనవరి 19 నుండి 25వ తేది వరకు మాధాపూర్ CCRT లో జరుగుతున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన ఉత్సవం జ్యోతి ప్రజ్వలనతో వైభవంగా ప్రారంభమైంది.

సంస్కృతి ఫౌండేషన్ ప్రతిఏటా ఐదు రోజులు నిర్వహించే సంగీత ఉత్సవం ఈ సంవత్సరం ఏడు రోజులపాటు నిర్వహించబడుతోంది. ప్రతిరోజు సాయంత్రం సంగీత కచేరీలు, జనవరి 24వ తేదిన విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయి. జనవరి 25వ తేది ఉదయం ఈ ఉత్సవపు ప్రధాన అంశాలు; వెయ్యికి పైగా కళాకారులచే పంచరత్న సేవ, ఉంఛవృత్తి, ప్రసిద్ధ సంగీత విద్వాంసులు శ్రీమాన్ డా. కొమాండూరి శేషాద్రి గారు, శ్రీమాన్ నేమాని సోమయాజులు గారు, సంగీత విదుషీమణి శ్రీమతి మండా సుధారాణి గార్లకి గురు సన్మానం, హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ త్యాగరాజ స్వామి మూర్తులకు అభిషేక సేవ ఉంటాయి.

ముందుగా ఈనాటి సాయంత్రం గాత్ర కచేరి విదుషీమణి కమలా రమణి గారి విద్యార్థులచే ప్రారంభమైంది. చిరంజీవి M వేదాంత్ దేశికన్ మృదంగం పై, కుమారి అక్షయ శ్రీనివాసన్ వయోలిన్ పై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కచేరి ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.

తరువాత విద్వాన్ వికాస్ మైత్రేయ గారి గాత్రానికి విద్వాన్ శ్రీ షణ్ముఖ శ్రీవత్స గారు వయొలిన్, విద్వాన్ శ్రీ విద్యాసాగర్ గారు మృదంగం, విద్వాన్ శ్రీ ASK కౌండిన్య గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కచేరి సంగీతమయ సాయంత్రాన్ని మరింత గుబాళింప చేసింది.

మూడవ కార్యక్రమంగా విదుషీమణి శ్రీమతి రంజని శివకుమార్ గారి శుభగాత్రం శ్రోతలకి శ్రవణానందాన్ని కలిగించింది. విద్వాన్ శ్రీ షణ్ముఖ శ్రీవత్సవ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ విద్యాసాగర్

గారు మృదంగం పై, విద్వాన్ ASR కౌండిన్య గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించి ఈ కార్యక్రమాన్ని ప్రేక్షక మనోరంజకంగా చేశారు.

నాలుగవ కార్యక్రమంగా సాగిన విద్వాన్ శ్రీ DV మోహన్ కృష్ణ గారి గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది. విదుషి శ్రీమతి శివాని గాయత్రీ వయొలిన్ పై, విద్వాన్ శ్రీ NS కళ్యాణ్ రామ్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ శ్యామ్ కుమార్ గారు కంజీర పై వాద్య సహకారాన్ని అందించారు.

**20-01-26 రెండవ రోజు** అమూల్యమైన కర్ణాటక శాస్త్రీయ సంగీత కీర్తనల నిధిని అఖండ వారసత్వ సంపదగా మనకు అందించిన త్యాగరాజ స్వామికి నివాళులు అర్పించింది.



ముందుగా "భారతీయ కళా సంస్కృతి" విద్యార్థుల నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.



రెండవ కార్యక్రమం విద్వాన్ శ్రీ తూపురాని శ్రీధర్ గారి గాత్రం. విద్వాన్ శ్రీ KLN మూర్తి గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ ఫణి భూషణ్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ డా. శ్రీకాంత్ గారు కంజీర పై వాద్య సహకారాన్ని అందించారు.



మూడవ కార్యక్రమం శ్రీమతి దర్భ మృదురవళి గారి గాత్రం. విద్వాన్ శ్రీ KLN మూర్తి గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ D శ్రీకాంత్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ ఫణి భూషణ్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.

స్వరలయ సుధ విశిష్ట కార్యక్రమం.

లయకళావిపంచి విద్వాన్ శ్రీ పెరవలి జయభాస్కర్ గారి మృదంగ విన్యాసం.



సహకార కళాకారులుగా గాత్రంలో శ్రీ మల్లెల కాంతిస్వరూప్ గారు, విద్వాన్ శ్రీ ఓరుగంటి రాజశేఖర్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ సరస్వతుల హనుమంతరావు గారు ఘటం పై, విద్వాన్ శ్రీ కల్లూరి శ్రీనివాస్ గారు కంజీర పై వాద్య సహకారాన్ని అందించిన ఈ కార్యక్రమం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ప్రైమ్ 9 గ్రూప్ వాసునాధ్ రెడ్డి, శశిధర్ రెడ్డి, సూర్య గారు మరియు, శ్రీపా లాజిస్టిక్ కోకలి వెంకట

రామారావు గారు, శ్రీ పద్మిని గార్లు కళాకారులను సన్మానించారు. మంగళం తో రెండవరోజు కార్యక్రమం అద్భుతం గా జరిగింది.

**మూడవరోజు : 21-01-26**

గాత్ర, వాద్య, నృత్య రూపాలలో అనేక అరుదైన త్యాగరాజ స్వామి కృతుల ప్రదర్శనలతో 11వ హైదరాబాద్ త్యాగరాజ ఆరాధనోత్సవం (HTAMF 2026) ఏ రోజుకు ఆ రోజు కర్ణాటక శాస్త్రీయ సంగీతజ్ఞులకి, సంగీత అభిమానులకి వీనులకింపుగా, కన్నుల పండుగగా సాగిపోతోంది.



మొదటి కార్యక్రమం కుమారి దుడ్డు V కార్తీక మనస్విని గాత్రకచేరి ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. వీరికి కౌడిన్య గారు వయోలిన్, విద్వాన్ ఆరంగి శ్రీనివాస్ గారు మృదంగం పై వాద్య సహకారాన్ని అందించారు.



రెండవ కార్యక్రమం విద్వాన్ శ్రీ ఎల్లా బాలమురళీకృష్ణ గారి గాత్రం. విద్వాన్ శ్రీ K అనంత సౌరి రాజన్ గారు వయొలిన్ పై, శ్రీ డా. P శ్రీనివాస గోపాలన్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ బి జనార్ధన్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



మూడవ కార్యక్రమం శ్రీమతి శ్రీవిద్య జానకిరామన్ గారి గాత్రకచేరి. విద్వాన్ శ్రీ అనంత సౌరి రాజన్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ డా. P శ్రీనివాస గోపాలన్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ బి జనార్ధన్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



నాలుగవ కార్యక్రమం. విద్వాన్ శ్రీ D రాఘవాచారి గారి గాత్రకచేరి.

విద్వాన్ శ్రీ BS నారాయణ గారు వయొలిన్ పై, విద్వాన్ నేమని సోమయాజులు గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ బి జనార్ధన్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమం ఆసాంతం ప్రేక్షకులకు మనోరంజకంగా సాగింది.

అనంతరం ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన

సిలికానాంధ్ర అధ్యక్షులు శ్రీమతి ప్రియా తనుగుల గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్వాంసులను సన్మానించారు. హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని ఒక తపస్సులా నిర్వహిస్తున్న సంస్కృతి ఫౌండేషన్ వారిని అభినందించారు.

**నాలుగవరోజు : 22-01-26**

త్యాగరాజ స్వామి సంగీత సాంస్కృతిక వారసత్వ సంపదకి వందనం.



మొదటి కార్యక్రమం చి. వృషాంక్ రామడుగు గాత్రకచేరీ. తన శ్రావ్యమైన గాత్రం అందరినీ ఎంతగానో అలరించింది. శ్రీ మహావాది వాసు శాస్త్రి గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ అరవింద్ గారు మృదంగం పై వాద్య సహకారాన్ని అందించారు.



రెండవ కార్యక్రమం విద్వాన్ శ్రీ B.వెంకట విద్యాసాగర్ గారి గాత్రకచేరి. శ్రీ మహావాది వాసు శాస్త్రి గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ అరవింద్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ TP బాలసుబ్రహ్మణ్యం గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



(VOCAL DUET) విదుషీ శ్రీమతి అరుణ, పద్మ గార్ల గాత్రకచేరి. శ్రీ మహావాది వాసు శాస్త్రి గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ అరవింద్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ TP బాలసుబ్రహ్మణ్యం గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



(VIOLIN CONCERT) విద్వాన్ శ్రీ ద్వారం సత్యనారాయణ గారి వయొలిన్ కచేరి. శ్రీ భట్టి పవన్ సింఘ్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ పెరవలి జయ భాస్కర్ గారు మృదంగం పై, మరియు విద్వాన్ శ్రీ TP బాలసుబ్రహ్మణ్యం గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.

అనంతరం ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన శ్రీమతి రామారవి గారు, D. R వివేకానంద సూరి గారు, విశ్వనాథ్ గారు కళాకారులను సన్మానించారు. సంస్కృతి ఫౌండేషన్ వారు చేస్తున్న ఈ మహా యజ్ఞాన్ని కొనియాడారు.

**ఐదవరోజు : 23-01-26**

త్యాగరాజ స్వామి సంగీత, సాహిత్య వారసత్వ సంపదకి వందనం.



మొదటిగా కుమారి గుదిమెళ్ల సింధు గారి బసూన్ కచేరీ. శ్రీ NC అనంతకృష్ణ గారు వయొలిన్ పై, శ్రీ CH రామకృష్ణ గారు మృదంగం పై వాద్య సహకారాన్ని అందించారు. వినూత్నమైన ఈ వాద్యము ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కుమారి సింధు రఘునాయక హంసధ్వని రాగం, నీ సమానమెవరే రామయ్య, ఎందరో మహానుభావులు తన వాయిద్యం పై వాయించి ప్రేక్షకులను మంత్ర ముగ్ధల్ని చేసారు.



రెండవ కార్యక్రమం విద్వాన్ శ్రీ SM సుభాని గారి మాండొలిన్ కచేరి. విద్వాన్ శ్రీ రామరాజు దినకర్ గారు వయొలిన్ పై, విద్వాన్ CH రామకృష్ణ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ తేజస్వి గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు. సుభాని గారు మాండలిన్ పై మారుబల్కకున్నావేమిరా,మొదలగు కృతులు శ్రుతి రంజకం గారు తన మండలిన్ పై వాయించారు.



మూడవ కార్యక్రమం విద్వాన్ శ్రీ N రామమూర్తి గారి గాత్రకచేరి. విద్వాన్ శ్రీ రామరాజు దినకర్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ CH రామకృష్ణ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ రవీంద్ర తేజస్వి గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



నాలుగవ కార్యక్రమం “నౌకా చరితం” కూచిపూడి నృత్య ప్రదర్శన. విదుషి శ్రీమతి కోక విజయలక్ష్మి గారి బృందం చేసినటువంటి నృత్య ప్రదర్శన ఆసాంతం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది.

ఈ నాటి ముఖ్య అతిధులుగా మాధురి గారు, గంధం బసవ శంకర రావ్ గారు, ఫ్లూట్ ఫణి గారు కళాకారులను సన్మానించారు గారు కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని ఒక తపస్సులా

నిర్వహిస్తున్న సంస్కృతి ఫౌండేషన్ వారిని అభినందించారు.

**ఆరవరోజు : 24-01-26**




ఈరోజు ఉదయం 7 గంటల నుండి జంట నగరాలలో వివిధ గురువుల వద్ద శాస్త్రీయ కళలను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రదర్శనలు శిల్పారామంలో ఎంతో చక్కగా సాగాయి. ఇందులో 25కు పైగా కచేరీలు జరిగాయి.







5 సంవత్సరాల బాలల నుండి 70 సంవత్సరాల వయస్సు వరకు వివిధ గురువుల వద్దసంగీత, వాద్య, నృత్యం నేర్చుకుంటున్న అనేకమంది ఈ కార్యక్రమం లో పాల్గొనటం చూపారులను మరింత ఆకట్టు కుంది. వరలీల గానలోల తో మొదలైన చిన్నారుల ప్రదర్శన లు ఎందరోమహానుభావుల తో కార్యక్రమం కన్నులపండుగగా సాగింది.

ఈనాటి సాయంత్రం ముఖ్యఅతిథితులచే జ్యోతి ప్రకాశన కార్యక్రమం జరిగింది.

మొదటి కార్యక్రమం గురుకులం విద్యార్థుల గాత్రకచేరి. శ్రీ వేదాంత్ దేశికన్ గారు మృదంగం పై వాద్య సహకారాన్ని అందించారు. ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో విద్యార్థులకు ఆశీర్వాదాలను అందించారు. ఈ కార్యక్రమం అతిధులను, సంగీత అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.



రెండవ కార్యక్రమమైన విద్వాన్ శ్రీ కైవల్య చిల్లా గారి గాత్ర కచేరి ఎంతో అద్భుతంగా సాగింది. వీరికి విద్వాన్ శ్రీ పెరవలి నందకుమార్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ CH కార్తికేయ ఆదినారాయణ శర్మ గారు మృదంగం పై, మరియు విద్వాన్ శ్రీ M చంద్రకాంత్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.



మూడవ కార్యక్రమం విద్వాన్ శ్రీ మండా

అనంత కృష్ణ గారి ఫ్లూట్ కచేరి. విద్వాన్ శ్రీ పెరవలి నందకుమార్ గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ CH కార్తికేయ ఆదినారాయణ శర్మ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ చంద్రకాంత్ గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమం ప్రేక్షక జనరంజకంగా సాగింది.



నాలుగవ కార్యక్రమం విద్వాన్ శ్రీ డా. MV సింహాచల శాస్త్రి గారి హరికథా గానం. విద్వాన్ శ్రీ జయరాం గారు వయొలిన్ పై, M చంద్రకాంత్ గారు మృదంగం పై వాద్య సహకారాన్ని అందించారు. ఆ త్యాగరాజ స్వామి యొక్క అంతరంగాన్ని తమ హరికథ ద్వారా దర్శింపజేసిన సింహాచల శాస్త్రి గారికి ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో నమస్కారాల్ని తెలియజేశారు.

**ఏడవరోజు : 25-01-26**



అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పంచరత్న సేవ రానే వచ్చింది. ముందుగా ఈరోజు ఉదయం ఏడు గంటలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గురువులు, సంగీత అభిమానులు, ఎంతో భక్తి శ్రద్ధలతో శిల్పారామంలో ఆ త్యాగబ్రహ్మ యొక్క చిత్రపటాన్ని పట్టుకొని త్యాగరాజ స్వామి రచించిన అనేక కీర్తనలను గానం చేస్తూ ఉంఛవృత్తిని నిర్వహించారు.





అనంతరం ఈనాటి సన్మాన గ్రహీతలు శ్రీమాన్ డా. కొమాండూరి శేషాద్రి గారు, శ్రీమాన్ నేమాని సోమయాజులు గారు, విదుషీమణి మండా సుధారాణి గార్లను సంస్కృతి ఫౌండేషన్ వారు సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన..పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరావ్ గారు,. కలరత్న రాఘవచారిగారు, మొదలగు పెద్దలు, ఒక యజ్ఞంలా భావించి ఇంత దిగ్విజయంగా 11వ సంవత్సరం కూడా త్యాగరాజ ఆరాధనను నిర్వహించిన సంస్కృతి ఫౌండేషన్ వారిని కొనియాడారు.

అనంతరం లక్ష్మణ సమేత సీతారామ హనుమత్ త్యాగరాజ స్వామి విగ్రహాలకు పండితులు శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు.

స్వామివార్లకు అభిషేకం జరిగే సమయంలోనే వెయ్యికి పైగా కళాకారులు పంచరత్న కీర్తనలను గాత్ర, వాద్య పరికరాలతో ఆరాధించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగానే కాక పరోక్షంగా కూడా మీడియా మాధ్యమాల ద్వారా ఎందరో దర్శించారు.





**సాయంత్రం కచేరీలు...**




(VIOLIN DUET) మొదటి కార్యక్రమం గురుకులం విద్యార్థులు కుమారి అదితి వాసుదేవన్, కుమారి ఇందుశ్రీ శ్రావ్యల వయొలిన్ కచేరి. వీరికి శ్రీ అచ్యుతానంద్ గారు మృదంగ సహకారాన్ని అందించారు. ఈ వయొలిన్ కచేరి ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంది. గురుకులం విద్యార్థులు అధితి, ఇందు వయోలిన్ పై ఉపచారము చేసే వరున్నారని, నిధి చాలా సుఖమా, తెలిసి రామచింతనతో ఎంతో అద్భుతం గా వాయించారు.




రెండవ కార్యక్రమమైన కుమారి కొమ్మాజోస్యుల అలేఖ గాత్ర కచేరి ఎంతో అద్భుతంగా సాగింది. విద్వాన్ షణ్ముఖ శ్రీవత్స గారు వయోలిన్ పై, విద్వాన్ శ్రీ బి. శ్రీరామమూర్తి గారు మృదంగం పై, విద్వాన్ కౌండిన్య గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.




మూడవ కార్యక్రమమైన విదుషీమణి శ్రీమతి ఈమని లలితా కృష్ణ గారి వీణా కచేరి ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్వాన్ కార్తికేయ

మృదంగం పై, విద్వాన్ కౌండిన్య గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు.




ఈనాటి సన్మాన గ్రహీత విదుషి శ్రీమతి మండా సుధారాణి గారి గాత్రకచేరి. విదుషి శ్రీమతి బి దుర్గా భవాని గారు వయొలిన్ పై, విద్వాన్ శ్రీ సద్గురు చరణ్ గారు మృదంగం పై, విద్వాన్ శ్రీ మార్టూరు హరిబాబు గారు ఘటం పై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమం ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

సంస్కృతి ఫౌండేషన్ వారు ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. ఏడు రోజులు పాటు దిగ్విజయంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహించిన సంస్కృతి ఫౌండేషన్ వారిని వేనోళ్ళ కొనియాడారు. ఆంజనేయ ఉత్సవం, త్యాగరాజ స్వామి మంగళంతో ఈ కార్యక్రమం సంపూర్ణమైంది.

**– శ్రీ ఆశిష్**

## పిఠాపురంలో అలరించిన విష్ణుభట్ల గాత్ర సంగీత కచేరీ

### ఘనంగా వాల్మీకి జయంతి, శంకరాచార్య ఆరాధనోత్సవం




గాత్ర కచేరీ అలరించింది.. ఆహూతులు సంగీత సాగరంలో ఓలలాడారు.. కర్ణపేయమైన గాత్రానికి పక్క వాయిద్యాలు చక్కగా అమరాయి. పిఠాపురం శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో సంస్కార భారతి, సంగమేశ్వర సంగీత సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి, శంకరాచార్యుల ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అతిథులు శేఖర్, సాయిలక్ష్మి, ఆకొండి శ్రీ నివాస రాజారావు జ్యోతిప్రజ్వలన చేశారు. వాల్మీకి, శంకరాచార్యుల జీవిత విశేషాలను వివరించారు. అనంతరం కాకినాడకు చెందిన విష్ణుభట్ల శ్రీ రామచంద్ర మూర్తి గాత్ర కచేరీ నిర్వహించారు. తోడి వర్ణంతో ప్రారంభించి, వినాయక.. నిను వినా, మరుగేలరా ఓ రాఘవ తదితర సంకీర్తనలతో ఆహూతులను మైమరిపించారు. గాత్రానికి వయోలిన్ పై కాకినాడకు చెందిన హరిప్రసాద్, మృదంగం పై ఆముదాల వలసకు చెందిన బంకుపల్లి దుర్గా శ్రీనివాస శర్మ, కంజీర పై కాకినాడకు చెందిన వెంటూరి పరశురాం సహకారం అందించారు. గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, వెన్నపు చక్రధరరావు, కొండెపూడి శంకరావు, వింజమూరి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## “స్వరఝరి” సంస్థ నిర్వహించిన “తెలుగుభాషా సంగీత మహాసభలు”- విజయవాడ

పాల్గొన్న 175 మంది కళాకారులూ మూడు రోజులపాటు 30 కార్యక్రమాలలో ఒక్కొక్కరు గంట చొప్పున ఎంతో నిబద్ధతతో తమ చక్కని ప్రదర్శనలు ఇచ్చారు.

విశేష సంఖ్యలో హాజరైె శ్రోతలు తెలుగు తల్లికి, సంగీత సరస్వతికి నీరాజనాలు పట్టారు. ఇంతకూ ఏమిటి ఆ సభలు? అంటే.. బెజవాడ హనుమంతరాయ గ్రంథాలయం హాలులో 2026 ఫిబ్రవరి 12,13,14 తేదీలలో “స్వరఝరి” (1988 స్థాపితం) సంస్థ నిర్వహించిన “ తెలుగుభాషా సంగీత మహాసభలు”..

సంగీతానికి తెలుగుభాష ఎంత అందంగా ఒదిగిపోయిందో తెలిపే ప్రయత్నం చేశాను.. మొట్టమొదటిసారి చేసిన ప్రయోగమది! అన్ని రకాల సంగీత ప్రక్రియలను ఒకచోట చేర్చి, వాటిలో విశేష కృషిచేసిన వివిధ కళాకారులను ఆహ్వానించి, వాటిలోని తెలుగు తియ్యందనాలను శ్రోతలకు పంచి, వివరణాత్మకంగా రూపొందించిన ఈ మహాసభలకు జనం బ్రహ్మరథం పట్టారు అనటం అతిశయోక్తి కాదు.

ప్రత్యక్షంగా చూసినవారికన్నా ఎన్నోరెట్లు YOUTUBE ప్రత్యక్ష ప్రసారాలలో వీక్షించారు. ఫిబ్రవరి 12 ఉదయం నాట్యాచార్య శ్రీ CH అజయ్ కుమార్ శిష్యురాండ్లచే వినాయక కౌతం,స్వాగత నృత్యం,”మా తెనుగుతల్లికి మల్లెపూదండ” నృత్యం కన్నుల పండువగా సాగింది. అనంతరం పద్మశ్రీ అన్నవరపు రామస్వామిగారి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో శ్రీ SAV ప్రసాదరావు దంపతులు,శ్రీయుతులు గజల్ శ్రీనివాస్,ధూళిపాల రామకృష్ణ,కప్పగంతు రామకృష్ణ గార్లు విచ్చేసి, ఈ మహాసభల ఆలోచనను,ఆశయాలను ప్రశంసించారు. శ్రీమతి పసుమర్తి పావని తెలుగుతల్లిపై ప్రార్థన గీతం హృద్యంగా ఆలపించారు.

సమయపాలనకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ సాగిన కార్యక్రమాలలో ముందుగా సరిగ్గా 10 గంటలకు శ్రీ గండూరి శ్రీనివాస మూర్తి శిష్యులచే “సంగీత త్రిమూర్తుల తదనంతర వాగ్గేయకారుల తెలుగు రచనలు” బృందగాన కార్యక్రమం జరిగింది. శ్రీయుతులు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్,మైసూరు వాసుదేవాచార్య,పొన్నయ్య పిళ్లై, GNB తదితర వాగ్గేయకారుల రచనలను గాయనీమణులు చక్కగా పాడారు.వాటిలో ఎన్నో అపురూప రచనలు ఉండటం విశేషం.

తదుపరి డా.శేషులత విశ్వనాథ్ (హైదరాబాద్) గారు “శ్రీ రాకమచర్ల వెంకటదాసు గారి కీర్తనలు” ఆలపిస్తూ, వారి జీవిత విశేషాలను సైతం వివరించారు. గాయని గానే కాక, స్వరకర్తగా శేషులతగారి ప్రావీణ్యం శ్లాఘనీయం. చిక్కటి తెలుగులోని సంకీర్తనలు శ్రోతలను అలరించాయి. అనంతరం డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య (హైదరాబాద్) గారు “అన్నమయ్య

తెలుగుభాషా వరివస్య" అనే అంశంపై ప్రసంగిస్తూ, అన్నమయ్య కీర్తనలలోని తెలుగు పలుకుబడులు, సామెతలు,పదబంధాల అందాలను సోదాహరణంగా వివరించారు.

భోజనవిరామానంతరం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీమతి P.శాంతిశ్రీ (ఏలూరు),"సినీ సంగీతంలో విరబూసిన తెలుగు భాష" అనే అంశాన్ని తీసుకొని, తన సుమధుర గళంతో పాటలు ఆలపిస్తూ ప్రసంగించారు. పాత, క్రొత్త సినీమాలలోని పద్యాలు, పాటలు, యక్షగానాలు.. ఒకటేమిటి? అన్నింటినీ పాడి, తెలుగు భాషకు పట్టం కట్టిన చలనచిత్ర సుందరిని కనులవిందు సాక్షాత్కరింపచేశారు.

సాయంత్రం 4 గంటలకు శ్రీ పప్పు సదాశివశాస్త్రి, తన శిష్య బృందంతో "అన్నమయ్య కీర్తనలను" భక్తి తన్మయత్వంతో పాడారు. మధ్యమధ్యలో సాహిత్య సొబగులను వివరిస్తూ శ్రోతలతో మమేకమై సాగిన బృందగానం ఎంతో ఆకట్టుకుంది. తదుపరి కాకినాడకు చెందిన శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు (కాకినాడ) "ఆంధ్రేతర వాగ్గేయకారుల తెలుగు సంగీత రచనల" ను వివరణాత్మకంగా గానం చేశారు. తంజావూరు ను పరిపాలించిన శివాజీ మహరాజ్ వంశానికి చెందిన మరాఠీ రాజుల నుండి తమిళులైన GN బాలసుబ్రహ్మణ్యం గారి వరకు తెలుగులో రచించిన చక్కని రచనలను విశ్లేషిస్తూ మధురంగా గానం చేశారు.

సాయంత్రం 6 గంటలకు శ్రీమతి రాగంపూడి అమూల్య బృందంచే "వెంకటాద్రిస్వామి కీర్తనల" గానం రసరమ్యంగా సాగింది. మోదుమూడి సుధాకర్ స్వరపరచిన పది కీర్తనలు బృందం ఆలపించారు. కృష్ణాజిల్లాకు చెందిన వెంకటాద్రిస్వామివారి కీర్తనలు కంచిలోని వరదరాజస్వామి ఆలయంలో నిత్య కైంకర్యాల సమయంలో గానం చేయబడటం విశేషమే! సరళమైన తెలుగులో ఛందోబద్ధంగా రచింపబడిన ఆ కీర్తనల సాహిత్యాలను తంజావూరు నుండి సేకరించవలసి రావటం దురదృష్టకరం. అనంతరం శ్రీమతి K లక్ష్మీనరసమ్మ "లలిత సంగీత శిఖరాలు రజని, మల్లిక్" మొదలైనవారి అమూల్య గీతాలను, బాణీలను పాడుతూ, అర్థాలను వివరిస్తూ కార్యక్రమాన్ని రసవత్తరంగా నిర్వహించారు. రేడియో ద్వారా శ్రోతలకు చేరువైన లలిత సంగీతంలో కనబడే తెలుగుభాష స్వచ్ఛతను గాయని తన సుమధుర గళంలో వినిపించారు.

మొదటి రోజు చివరి కార్యక్రమంగా శ్రీమతి K తుషార పూర్ణవల్లి బృందం (16 మంది) "భద్రాచల రామదాసు కీర్తనలను" నామసంకీర్తనా సరళిలో భక్తి పారవశ్యంతో గానం చేశారు. బహుళ ప్రసిద్ధమైన రామదాసు కీర్తనలతో పాటు దాశరథీ శతకంలోని పద్యాలకు కూడా చోటు కల్పిస్తూ గానం శ్రావ్యంగా కొనసాగింది.

13-2-2026 కార్యక్రమాలు ఉదయం 9 గంటలకు శ్రీమతి అరుణ చంద్రరాజు(హైదరాబాద్) గారి సోదాహరణ ప్రసంగంతో ఆరంభం

అయ్యాయి."త్యాగయ్య పంచరత్న కృతుల చరిత్ర–విశిష్టత" లను అరుణగారు వివరించారు. బెంగళూరు నాగరత్నమ్మగారు, మహారాజపురం విశ్వనాథ అయ్యర్ గారు తదితరులు ఘనరాగ కృతులను అయిదింటిని ఏరి, ఒక గుచ్ఛంగా ఏర్పరచారని,పంచరత్న కృతుల గోష్టిగానంలో అందరూ ఒకే విధంగా పాడటం అవసరమని, ఆరభి పంచరత్న కృతిలోని చరణాలను "సాధించెనే" అనే పల్లవితో కలపటం సరియైనదని, కనీసం తెలుగువారైనా ఈ విధంగా పాడితే బాగుంటుందని అన్నారు. అనంతరం మోదుమూడి సుధాకర్ బృందం అదేవిధంగా పంచరత్న కృతుల సాహిత్యాలను గానం చేశారు.

10 గంటలకు శ్రీ కరి బాలాజీ (హైదరాబాద్) "లలిత సంగీతంలో సంగీత సాహిత్య విలువలు" అనే అంశంపై ప్రసంగిస్తూ ఎన్నో మధురమైన లలిత గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. లలిత సంగీత నిఘంటువు వంటి ఆయన పేర్కొన్న ఎన్నో సంగీత, సాహిత్య విషయాలు శ్రోతలను విస్మయులను చేశాయి. తదుపరి శ్రీమతి మోదుమూడి అంజన బృందం ఆలపించిన "సంప్రదాయ పెళ్లిపాటలు" ఆబాల గోపాలాన్నీ అలరించాయి.గౌరీ వ్రతం నుండి అప్పగింతల వరకు వివిధ పెళ్ళి తంతులలో ఒకనాడు అతివలు పాడుకున్న పాటలు సందర్భోచితంగా హాస్య, శృంగార రస దీపికలుగా ఎలా ఉండేవో వినిపించారు. అప్పగింతల పాటలోని అమ్మభాష కమ్మదనం, శ్రోతల హృదయాంతరాళాలను తాకింది.

శ్రీ K సూర్యనారాయణ గారు"జానపద సంగీతంలో తెలుగుభాష" అనే అంశాన్ని చేకొని,ఎన్నో జానపద గీతాలను హుషారుగా వినిపించారు. తెలుగునాట కనుమరుగైన అచ్చ తెలుగు మాండలికాలు, జానపద శైలిలోని స్త్రీల పాటలు,ప్రేమ పాటలు, శ్రామిక,కర్షక,విప్లవ గీతాలు, వాటికి తెలుగుభాష అందించిన పదమంజీరాలు..ఎంతో చక్కగా పాడుతూ విశ్లేషించారు.

మధ్యాహ్నం 3 గంటలకు డా.TK సరోజ (హైదరారాబాద్) గారి సోదాహరణ ప్రసంగం, గానం : ఉత్సవంలో మకుటాయమానంగా నిలిచింది."భాష–భావన: శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల వారి సంగీత సృజన" పై అద్భుత ప్రసంగం చేశారు. ఆచార్యులవారి భాషా వైదుష్యం, కృతి రచనలో వైవిధ్యం, బహుముఖ పాండిత్యం.. ఎంతో లోతుగా విశ్లేషించారు."తెలుగునాట పుట్టిన ఎందరో మహానుభావుల తెలివితేటలు తెలుసుకోక పోవటం తెలుగువారి తెంపరితనం" అనిపించింది. సాయంత్రం 4 గంటలకు శ్రీ మల్లాది సూరిబాబు గారు " క్షేత్రయ్య పదాలను" కడు రమ్యంగా గానంచేశారు. ఎంతో సంగీతానుభవం,లయ ప్రావీణ్యం ఉంటేగానీ క్షేత్రయ్య పదాలు పాడలేరు.తెలుగువారి సొత్తయిన ఈ పదాలు ప్రచారం చేసింది బృంద,ముక్త గార్ల వంటి తమిళులే..తన గంభీర గళంలో సూరిబాబు గారు వినిపించిన పదాలు ఆయన సాధనా పటిమను ద్యోతకం చేశాయి.

# "స్వరఝురి" సంస్థ నిర్వహించిన "తెలుగుభాషా సంగీత మహాసభలు" దృశ్యమాలిక



































ఫిబ్రవరి
12 13 14
గురు శుక్ర శని


ఫిబ్రవరి
12 13 14
గురు శుక్ర శని






















తదుపరి "శ్యామశాస్త్రి రచనలను" కర్ణపేయంగా వినిపించారు విష్ణుభొట్ల సోదరీమణులు సరస్వతీ,కృష్ణవేణి గార్లు. తమ శిష్యులతో కలసి భక్తిరస గుళికల వంటి కృతులను, కామాక్షీ మాతతో శ్యామశాస్త్రి గారు చేసుకున్న విన్నపాలను కడు ఆర్ద్రతతో వినిపించారు వారిరువురూ.. హైదరాబాద్ నుండి విచ్చేసిన శ్రీ DV మోహనకృష్ణ (హైదరాబాద్), తమ గురువులైన "మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి రచనలలోని విశిష్టతలను విశదపరిచారు..మురళీగారి రచనలలో తెలుగు సాహిత్యం ఎన్ని సొంపుల రేఖలు దిద్దుకున్నదీ, అనర్గళంగా గానంచేస్తూ వివరించారాయన.. అన్నిరకాల సంగీత రచనలు ఏ వాగ్గేయకారుడు చేయలేదని చెప్తూ..తెలుగుతల్లి వెలుగులను విశ్వవ్యాప్తం చేసిన తన గురువుకు స్వరనీరాజనాలు అందించారు.

తదనంతర కార్యక్రమం "ఆదిభట్ల నారాయణ దాసు గారి రచనల" గానం.దీనిని డా.మల్లాది రవికుమార్ బృందం సుమారు పాతికమంది కలసి మనోహరంగా సమర్పించారు. హరికథా పితామహుని అనుపమాన ఆంధ్ర భాషా వైదుష్యాన్ని సవివరంగా తెలుపుతూ, వారి రచనలను మచ్చుకు కొన్ని పాడి వినిపించారు. రెండవరోజు చివరి కార్యక్రమం "దాస సంప్రదాయ కీర్తనలు". వీటిని మోదుమూడి సుధాకర్,శ్రీమతి గుడిపాటి శ్రీలలిత కలసి హృద్యంగా గానంచేశారు. కుమారి వలివేటి నీరజ క్లుప్తంగా కొందరు దాససంప్రదాయ వాగ్గేయకారుల చరిత్రలు వివరిస్తుండగా సర్వశ్రీ వాసుదాసు, నిట్టల ప్రకాశదాసు, ప్రయాగ రంగదాసు, నరసదాసు మొదలైనవారి రచనలు సుధాకర్,శ్రీలలిత గారలు గానంచేశారు.

ఆఖరిరోజు 14-2-2026 కార్యక్రమాలు ఉదయం 9 గంటలకు నూజివీడు IIIT విద్యార్థుల బృందగానంతో ఆరంభం అయ్యాయి సుమారు ముప్పైమంది విద్యార్థులు "తెలుగుభాష సంకీర్తనలను" ఏకకంఠంగా వినిపించారు అన్నమయ్య, రామదాసు, త్యాగయ్య ఇత్యాది వాగ్గేయకారుల తెలుగు సంకీర్తనలు స్పష్టమైన ఉచ్చారణతో వారంతా పాడుతుంటే ఎంతో ముచ్చటగా అనిపించింది.. అందరూ సంప్రదాయ సిద్ధమైన దుస్తులలో రావటం అభినందనీయం. శ్రీ BV విద్యాసాగర్,శ్రీ J చంద్రమౌళి,శ్రీ M శ్రీధర్ గార్లు వీరికి అత్యుత్తమ తర్ఫీదును ఇచ్చారు. తదుపరి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంగీత శాఖకు చెందిన శ్రీమతి చింతలపాటి మంజుల,శ్రీమతి పసుమర్తిపావని గార్ల సోదాహరణ ప్రసంగాలు ఎంతో ఆకట్టుకున్నాయి. "తెలుగు భాషకు వాగ్గేయకారుల సేవ" అనేది వీరు తీసుకున్న అంశం. మంజులగారు వాగ్గేయకారుల తెలుగు భాషా సౌందర్యాన్ని గానంచేస్తూ వివరించగా, పావనిగారు నాట్యరంగాన్ని తీసుకొని, ఆ రంగంలోని సంగీత రచనలలోని భావాన్ని తాను నృత్య కళాకారిణి కూడా కనుక, గానం,అభినయం కూడా చేస్తూ

వివరించారు.ఎంతో వైవిధ్యం కలిగిన ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఎంతో రంజింపచేసింది.

తదుపరి, అనుభవంలో ఎంతో పెద్దలైన డా.గుడిపాటి లలిత (ఏలూరు) గారిచే "సంగీత మూర్తిత్రయం సంగీత శైలి" సోదాహరణ ప్రసంగం జరిగింది. తెలుగువారైన త్యాగయ్య, శ్యామశాస్త్రి గార్లు మాత్రమేకాక, తమిళులైన దీక్షితులవారు సైతం తెలుగులో పదవర్ణం, కొన్ని కృతులు,మణి ప్రవాళాలు రచించారని తెలియజేశారు.త్రిమూర్తుల రచనలలో పాటించిన యతి, ప్రాస, ఛందో నియమాలు, ఒప్పారిన భక్తిరసం.. ఎంతో చక్కగా వివరించారావిడ! మధ్యాహ్నం 12 గంటలకు శ్రీమతి మల్లాది కార్తీక త్రివేణి నిర్వహణలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు "వర్ణాలు,జావళీలు,తిల్లానాలు,తత్త్వాలు ,సంప్రదాయ పాటలు" మధురంగా గానంచేశారు. ఒకనాడు ఇంటింటా,ప్రతి పండుగకూ చిన్నారులు ,మహిళలు పాడుకొన్న సంప్రదాయ పాటలు, వాటిలో తెలుగుభాష అందం,వర్ణం మొదలుగా గల సంగీత రచనలలో గుబాళించిన తెలుగుభాష ..వీటిని మనోజ్ఞంగా వినిపించారు చిన్నారులు, యువకళాకారులు..

భోజన విరామం తరువాత, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ NCH బుచ్చయ్యాచార్యులు చే "తెలుగు సంగీత రచనలలో గాయకుల ఉచ్చారణ, భాషా దోషాలు–సవరణ" అనే అంశంపై చర్చ జరిగింది. సాధారణంగా గాయకులలో దొర్లే సాహిత్య పొరపాట్లు, ఉచ్చారణ దోషాలు..సోదాహరణంగా హాస్యరసాన్ని జోడించి,అనుపమానంగా వివరించారు ఆచార్యులు గారు.సంగీతం పాడే గాయకులు,తెలుగుభాష పట్ల ఎంత శ్రద్ధ వహించాలో,భావార్థాలు ఎంతగా వంట పట్టించుకోవాలో చక్కగా వివరించారు. తదుపరి త్యాగరాజ సారస్వతంపై డాక్టరేటు అందుకున్న డా.ములుకుట్ల బ్రహ్మానంద శాస్త్రి గారిచే "త్యాగరాజ సంగీత సాహిత్య వైదుష్యం" అనే అంశంపై ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. తమిళుల మధ్య జీవించినా, మాతృభాషను వీడక,తెలుగులో కృతి రచనచేసి,విశ్వవేదికలపై అన్ని ప్రాంతాల, భాషల కళాకారుల నోటా తెలుగును పలికించిన త్యాగయ్య, రామభక్తి సామ్రాజ్యానికి మకుటంలేని మహారాజని కొనియాడారు.తెలుగుతల్లి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన త్యాగయ్యను ఆంధ్రులు మరువరాదన్నారు.

శ్రీమతి మోదుమూడి అంజన,కుమారి లంక తేజస్వి "అధ్యాత్మ రామాయణ కీర్తనలను" వీనులకు విందుగా గానంచేశారు.మునిపల్లె సుబ్రహ్మణ్య కవి విరచిత ఆధ్యాత్మ రామాయణ కీర్తనలకు ఒకప్పుడు తెలుగునాట ఎంతో ప్రాచుర్యం ఉండేదని, ప్రతి తెలుగింటి ఆడబడుచూ పాడుకున్న ఈ కీర్తనలలో భక్తి,వేదాంతాలు మిళితమై ఉన్నాయని, తెలుగుభాషకు మణిదీపాల వంటి ఈ కీర్తనలను కాపాడుకోవటం తెలుగువారి కర్తవ్యమని చెప్తూ,సుమారు 10 కీర్తనలను

శ్రుతిశుద్ధంగా గానంచేశారు గాయనీమణులు.

తరువాతి కార్యక్రమం, శ్రీ కొమండూరి వేంకట కృష్ణ (తిరుపతి) గారి "శ్రీ TNCB నారాయణాచార్యులు గారి సంగీత, సాహిత్య వైదుష్యం" అంశంపై సోదాహరణ గానం. చక్కని తెలుగు పలుకుబడులతో, భక్తిరసం ఒప్పారే ఆచార్యులుగారి కృతులలోని తియ్యదనాన్ని, రాగ, స్వర సహితంగా వీనులకు పసందుగా పాడారు కృష్ణగారు. తెలుగునాట ఇంత చక్కటి పాండిత్యం గల జంత్ర, గాత్ర విద్వాంసులుండగా, పొరుగింటి పుల్లకూరకై ఎందుకు మన తెలుగు సభలవారు ఎగబడతారో అర్థంకాదు. తదుపరి శ్రీ పోపూరి గౌరీనాథ్ బృందంచే "తూము నరసింహదాసు కీర్తనల" గానం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.దాసుగారి జీవిత విశేషాలను వివరిస్తూ,తేనె వంటి తెలుగులోని తూమువారి రచనలను కర్ణపేయంగా సమర్పించారు గౌరీనాథ్ గారి బృందం.

మొత్తం సభలలోని చివరి కార్యక్రమంగా శ్రీ MV సింహాచల భాగవతార్ చే "తెలుగు భాష–త్యాగరాజ హృదయ ధ్వని" అనే హరికథాగానం శ్రోతల కరతాళధ్వనీపాత్రమై సాగింది.తొంభై ఆరుకోట్ల రామనామం చేసి,శ్రీరామ సాక్షాత్కారం పొందిన త్యాగయ్య పలుకే బంగారం...త్యాగయ్య కృతులే రాగాకృతులు..త్యాగయ్య తెలుగే లోకానికి వెలుగు..

మొత్తం 30 గంటలపాటు సాగిన ఈ మహా యజ్ఞానికి ఎందరో వదాన్యులు ఆర్థిక చేయూతనిచ్చారు.. కళాకారులంతా స్వచ్ఛందంగా పాల్గొని, తెలుగుభాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. విశేష సంఖ్యలో పాల్గొన్న శ్రోతలు, ఈ వినూత్న సభలను వేనోళ్ల ప్రశంసించారు. శ్రీ BVS ప్రసాద్, శ్రీ K సద్గురుచరణ్, శ్రీ KA శర్మ,శ్రీ కిషోర్, శ్రీ R సుధాకర్, శ్రీ పాలపర్తి నాగేశ్వరరావు, శ్రీ K సుబ్రహ్మణ్య రాజు, శ్రీ S కుమార్ బాబు,శ్రీ K శశిధర్, శ్రీ BVS శ్రీకృష్ణ, కుమారి మల్లాది సింధు రాగేశ్వరి, కుమారి NGS కీర్తన, శ్రీ ఇంద్రకీలాద్రి శర్మ, శ్రీ మల్లాది శివానంద యశస్వి, Y ఇందువర్ధన్, శ్రీ చిట్టిబాబు తదితరులు వాద్య సహకారం అందించారు. శ్రీ UV మోహనవంశీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

షడ్రుచులతెలుగుభోజనంలాంటి "తెలుగుభాషా సంగీత మహాసభలు" దిగ్విజయవంతం అయ్యాయి. ఈ మహాసభల స్ఫూర్తితో ఇక నుండి అయినా "తెలుగు మహా సభలలో" తెలుగు భాషకు పట్టం కట్టిన వాగ్గేయకారులకు స్థానం కల్పించి, కర్ణాటక సంగీత కచేరీలు కూడా ఏర్పాటుచేస్తారని ఆశిద్దాం.. ఆ మహాసభల ఆహ్వానపత్రంలో పేర్కొన్నవారంతా నూటికి నూరుశాతం హాజరు కావటం నిజంగా ఒక అద్భుతం!

**– మోదుమూడి సుధాకర్**

# సంగీత విద్వత్సభ, కాకినాడ

## 80వ సంక్రాంతి సంగీత నృత్య కార్యక్రమాలు.19జనవరి 2026 నుండి 28.1.26 వరకు.




19న కుమారి ఎస్.స్వరాత్మిక–చెన్నై–గాత్రం. ఎమ్.ఎస్.నీలాద్రిరావు,ఎమ్.ఏడుకొండలు,బి. దుర్గాశ్రీనివాసశర్మ (ఘటం) సహకారాలు.



20నమొదటి కార్యక్రమం కుమారి వక్కలంక సీత (యు.ఎస్.ఏ.) ప్రతిభావంతమైన భరతనాట్య ప్రదర్శన చేశారు.



20నప్రధాన కార్యక్రమం విద్వాన్ శ్రీముది గొండన్ రమేశ్, కుమార్తె శ్రీమతి సౌమ్య వీణాయుగళం. ఎమ్. ఏడుకొండలు, బి.దుర్గా శ్రీనివాసశర్మ సహకారాలు.




21న అభిషేక్ రవిశంకర్ – గాత్రం. ఎమ్.సత్యనారాయణ శర్మ, మంగళగిరి శ్రీధర్,ఎమ్. సూర్యప్రసాదరావు (ఘటం)సహకారాలు.




22న డా.ఆర్.కాశ్యప్ మహేష్–గాత్రం. పప్పు జ్ఞానదేవ్, కె.సద్గురుచరణ్, ఎమ్. సూర్యప్రసాదరావు(ఘటం) సహకారాలు.




23న శ్రీమతి హెచ్.రత్నప్రభ–చెన్నై–గాత్రం. పప్పు జ్ఞానదేవ్, కె.సద్గురుచరణ్, జి.వెంకటేశ్ (మోర్సింగ్).





24న "సిరికాకొలను చిన్నది" నృత్యరూపకం–శ్రీమతి స్మితా మాధవ్ బృందం.




25న పాల్ఘాట్ రాంప్రసాద్–చెన్నై గాత్రం. టి.కార్తీక్, బుర్రా శ్రీరామ్,ఎస్.హనుమంతరావు (ఘటం)సహకారాలు.




26న శ్రీమతి దీపిక, కుమారి నందిక–చెన్నై గాత్రయుగళం. టి.కార్తీక్, బుర్రా శ్రీరామ్, ఎస్. హనుమంతరావు (ఘటం) సహకారాలు.




27న యు.శ్రీనివాస్–నక్కపల్లి–మాండలిన్. హెచ్.రామచరణ్, కె.సాయికృష్ణ, టి.సాయిప్రకాశ్–రిథమ్ పాడ్స్.



28న "నరకాసుర వధ "మంగళూరు వారి యక్షగానం.

# "శ్రీ వేంకటేశ్వర చరితము మరియు ఇతర స్వీయ" రచనలు

## రచన: డా. గౌరి రాంమోహన్.




కర్ణాటక సంగీతంలో అనేక సిద్ధాంత అంశాలు పుస్తకాలలో వివరించబడతాయి. ఆ సిద్ధాంతాలని కొన్నింటిని ప్రాయోగిక సంగీతంతో అనుసంధానించే ప్రయత్నంగా డా. గౌరి రాంమోహన్ ఈ పుస్తకంలో స్వీయ రచనలను స్వరలిపులతో అందించారు. ఈ పుస్తకం కర్ణాటక సంగీతాభిమానులు, విద్యార్థులు, గాయకులు మరియు సంగీత పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**పుస్తకంలోని ప్రధాన అంశాలు:**

1. స్వర–సాహిత్య పల్లవి. "శంభో మహాదేవ" అనే నాదార్చన రూపంలో ఐదు ఘనరాగాలలో స్వరరచన చేయబడింది:

నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ రాగం

ఈ ఐదు రాగాలు ఘనరాగాలుగా ప్రసిద్ధి చెందాయి. వీటిలో చేసిన ఈ స్వర–సాహిత్య పల్లవి విశిష్టమైనది.

2. పంచనడ వర్ణం. డా. గౌరి తొలిసారిగా వర్ణ రూపంలో స్వరపరచిన ప్రత్యేక అంశం. విద్యార్థులకు రాగ స్వరూపం మరియు లయ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరం.

3. ఛఛట్పుట తాళ వర్ణం. సిద్ధాంత గ్రంథాలలో పేర్కొన్న 108 తాళాలలో మొదటిది అయిన ఛఛట్పుట తాళంలో తొలిసారిగా వర్ణం స్వరపరచబడింది. ఈ వినూత్న ప్రయత్నం కూడా డా. గౌరి గారి ప్రత్యేక కృషి.

4. ఐదు జాతుల ధృవ తాళ కృతులు. కర్ణాటక సంగీతంలో మరో వినూత్న ప్రయత్నంగా ధృవ తాళాన్ని ఐదు జాతులలో —

తిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ

ఈ ఐదు విధానాలలో ఐదు కృతులు స్వరపరచబడ్డాయి. అన్ని కృతులు స్వరలిపులతో ఇవ్వబడ్డాయి.

5. వివాది మరియు అరుదైన రాగాలలో కృతులు రామప్రియ, చిత్రాంబరి, కనకాంగి, చంద్రకౌన్, గాయకప్రియ, రఘుప్రియ మొదలైన వివాది మరియు అరుదైన రాగాలలో కృతులు స్వరలిపులతో అందించబడ్డాయి.

6. శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామి రాగమాలిక. శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామివారి పై నాల్గు రాగాలతో రాగమాలిక రూపంలో ఒక విశిష్ట కృతి సమర్పించబడింది.

7. శ్రీ వేంకటేశ్వర చరితం – డా. గౌరి గారు 24 రాగాలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి అవతార చరిత్రను వర్ణించారు. భగవంతుడైన శ్రీమన్నారాయణుడు భూమిపై శ్రీనివాసునిగా అవతరించిన విధానాన్ని వివరిస్తూ రూపొందించిన ఈ రాగమాలిక విశిష్టమైనదిగా నిలుస్తుంది. ఇలాంటి రూపకల్పన కర్ణాటక సంగీతంలో తొలిసారిగా చేయబడిన వినూత్న ప్రయత్నమని చెప్పవచ్చును.

**పుస్తక వివరాలు:**

ఈ పుస్తకంలో మొత్తం ఒక స్వర సాహిత్య పల్లవి, 32 కృతులు 9 వర్ణాలు మరియు, 24 రాగాలలో పూర్తి స్థాయి శ్రీ వేంకటేశ్వర చరితం అన్నీ స్వరలిపులతో సమగ్రంగా అందించబడ్డాయి. కర్ణాటక సంగీతాన్ని అభ్యసించేవారికి మరియు ఆస్వాదించేవారికి ఈ పుస్తకం అమూల్యమైన సంపద. ఈ గ్రంథం కావలసినవారు సెల్ నెం. 9866301302 కు సంప్రదించవచ్చు.



సంగీతలహరి రాజమహేంద్రవరంలో 22-2-2026న శ్రీమతి మల్లాది కార్తీక త్రివేణి తన కచేరి ని హామీరకల్యాణి రాగ వర్ణంతో ప్రారంభించి, ప్రణమామ్యహం, మానససంచరవే, ఎంతని విన్నవింతు, ఎంత ముద్దో అంశాలను పాడి శ్రోతలను మైమరపించారు. ముఖ్యాంశంగా వారు లలిత రాగంలో నన్ను బ్రోవు లలిత అనే కీర్తనలో వారి ప్రతిభ కరతాల ధ్వనులను అందుకున్నది. తిల్లాన తో కచేరి ముగించారు. వీరికి వైయలిన్ పై K. సుబ్రమణ్య రాజు మృదంగం పై శ్రీ కార్తికేయ ఆదినారాయణ శర్మ సహకరించారు.

**శ్రీసద్గురుసన్నిధి, రాజమండ్రి**




మార్చి 1వతేదీన శ్రీ తాడేపల్లి సాయికృష్ణ–తిరుచ్చి గాత్రం, మృదంగం పై డా. కందుల అనిల్ కుమార్, వైలన్ పై కూర పాటి సుబ్రహ్మణ్యరాజు (విజయవాడ) ఘటం పై కె. జగన్మోహిని (విజయవాడ) సహకరించారు.

# కార్తికేయ కళాక్షేత్రం విశాఖపట్నం శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవము








విశాఖపట్నం బి.వి.కే. కళాశాలలో ఫిబ్రవరి 2026 7వ తేదీన కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవము ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమములో భాగంగా ఉదయం 9 గం.లకు పంచరత్న సేవ జరిగింది. ఇందు నగరంలో ప్రముఖ కళాకారిణులు శ్రీమతి బండి శ్యామల, శ్రీమతి పప్పు పద్మారవిశకంర్, శ్రీమతి మండపాక శ్రీదేవి మొ. వారు పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా మధ్యాహ్నం 3.30 గం.లకు శ్రీమతి నోరి గాయత్రి బృందంచే శివసంకీర్తన జరిగింది. 4.30 గం.లకు నగరంలోని కళాకారులు శ్రీమతి వేదుల అరుణ –వీణ, శ్రీమతి సోమయాజుల సుబ్బలక్ష్మి – వీణ, శ్రీ నిప్పల కార్తీక్ – గాత్రం, మరియు కుమారి స్నిగ్ధ, పల్లవి, సంస్కృతి, మధురాక్షరి వీరు త్యాగరాజు కృతులు ఆలపించిరి. వీరికి వైలన్ పై శ్రీ యం. శశాంక్, శ్రీ టి.ఆర్. యశోదనందన్, మృదంగంపై శ్రీ సి.హెచ్. చాణక్య చంద్ర, శ్రీ ఎన్. ఋషీకేశ్ సహకరించారు.

అనంతరం కాకినాడ వాస్తవ్యులు ప్రముఖ గాత్ర విద్వాంసులు, వాగ్గేయకారులు, రచయిత అయిన శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గారి గాత్ర సంగీత సభ జరిగింది. వీరు పార్వతీపతిం అను హంసధ్వని రాగకృతి ముత్తు స్వామి దీక్షితార్ రచనతో తమ కార్యక్రమమును ప్రారంభించిరి. ఎట్టి యోచనలు – కిరణావళి రాగంలో మరియు శంభోమహాదేవ – పంతువరాళి రాగంలో ఎంతో రక్తిగా ఆలపించిరి.

'కాలభైరవం' అను కర్ణాటక శుద్ధ సావేరిలో స్వీయరచన మరియు ప్రధానంశముగా 'సదావట తరుమూల వాసినం' అను మధ్యమావతి రాగంలో స్వీయరచన అత్యంత హృద్యంగా ఆలపించగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, వీరికి వైలన్ పై శ్రీ పంతుల సాకేత్, మృదంగంపై శ్రీ ధన్వాడ ధర్మారావు చక్కని సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత గాత్ర కళాకారిణి శ్రీమతి మండ సుధారాణి ముఖ్య అతిథిగా విచ్చేసారు. శ్రీ వంకాయల వేంకటరమణమూర్తి, శ్రీమతి గౌరీ రామ్మోహన్, శ్రీమతి లలిత చంద్రశేఖర్ మొదలగు ప్రముఖ విద్వాంసులు ఈ కార్యక్రమంలో పాల్గొనిరి. త్యాగరాజ ఉత్సవాల సందర్భముగా నిర్వహించిన పోటీలలో విజేతలకు కళాకారులు బహుమతులు అందజేసిరి. ఈ పోటీలలో సుమారుగా 200 పైన విద్యార్థులు ఆన్ లైన్, ఆఫ్ లైన్ పోటీలలో పాల్గొనిరి. చివరిగా ప్రసాద వితరణతో కార్యక్రమము ముగిసింది. ఈ కార్యక్రమాన్ని వీణా విధుషి శ్రీమతి నిష్టల కృష్ణవేణి నిర్వహించారు.

# సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 179వ ఆరాధన ఉత్సవాలు - నాగోల్






నాదరమణీయమ్, వేణు గాన సభ, హోప్ ఆడ్ టీవి మరియు శ్రీ పద్మావతి, గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, నాగోల్ వారి సౌజన్యంతో, జనవరి 4 న సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 179వ ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు.

ఉదయం 9.00 గం నుండి 1.30 వరకు వేణువు, వీణ, వైయొలిన్ పై శిష్యులు పలు త్యాగరాజ కీర్తనలు వాయించారు. అనంతరం 1.30 నుండి సాయంత్రం 5.00 వరకు ప్రముఖ గురువులు స్వామి వారి కీర్తనలు వాయించారు.

తదుపరి, సాయంత్రం 6.30 నుండి సుమారు 100 వాయిద్యాల పై త్యాగరాజ స్వామి పంచరత్న గోష్ఠి వాయిద్య సేవ చేసారు.

AIR టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ అయ్యగారి శ్యామ్ సుందరమ్ గారు, ప్రముఖ వైణికురాలు శ్రీమతి మేడూరి పద్మావతి గారు, వైయొలిన్ విద్వాంసులు కోలంక సోదరులు, వేణువు పై శ్రీ శేషం రమణగారు, మృదంగంపై డా. శ్రీనివాస గోపాలన్, డా, శ్రీకాంత్, శ్రీ శ్రీధరాచారి మరి ఎందరో వయొలిన్, వీణ, వేణువు, మృదంగం , ఘటం, కంజీర విద్వాంసులు, గురువులు, శిష్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, శ్రీ రామచంద్ర రావు గారు, హెచ్ ఎం డీ ఏ జాయింట్ కమిషనర్ శ్రీ కోటా శ్రీవత్స గారు, విశేష అతిథులుగా రామోజీ ఫిల్మ్ సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ టి ఆర్ ఎల్ రావు గారు, ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాసాగరం జనరల్ సెక్రటరీ శ్రీ రామమూర్తి గారి విచ్చేసారు. వారు మాట్లాడుతూ, ఈ గోష్ఠి వాయిద్య సేవను ఏర్పాటు చేసిన నాదరమణీయమ్ వేణు గాన సభ అధ్యక్షులు శ్రీ శేషం రమణ గారి కృషిని కొనియాడారు. కేవలం వాయిద్యాల పై త్యాగరాజ స్వామి పంచరత్న గోష్ఠి వాయిద్య సేవను చేస్తున్న ఏకైక సభగా పేర్కొన్నారు. 2020లో 30 మంది వాయిద్య కళాకారులతో మొదలైన ఈ సేవ 7 సంవత్సరములలో సుమారు 100 మంది కళాకారులతో చేసుకునే స్థాయికి ఎదిగినది అని, ఇలా మరింతగా ఎదగాలని అన్నారు. శ్రీ శేషం రమణ గారి గురువుగారు కీ.శే. AIR నిలయ విద్వాంసులు శ్రీ వి. నాగరాజు గారి స్వప్నం గా ఉద్భవించిన నాదరమణీమ్ వేణుగాన సభ ప్రపంచంలోనే వాయిద్యాల పై త్యాగరాజ స్వామి పంచరత్న గోష్ఠి వాయిద్య సేవ చేస్తున్న ఏకైక సభ అని పేర్కొన్నారు.




Best Performance Award– HCL Concert Series 2025 Madras Music Academy presented to Sarvepalli Sisters Dr Sreya and Dr Raja Lakshmi



ఆంధ్రా యూనివర్శిటీ 22.2.26న నిర్వహించిన
వీణ సెమినార్ లో ప్రసంగిస్తున్న
ప్రముఖ వీణ విద్వాంసులు డా. దుర్గాప్రసాద్.



14 .12.25న ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన
ఘంటశాలజయంతి వేడుకలలో
సుప్రీంకోర్టు న్యాయమూర్తి గౌరవ.శ్రీ నరసింహ గారినుండి
సన్మానం అందుకొన్న గాయకుడు శ్రీ అంగాడి శివప్రసాద్.



విజయవాడలో 12-2-2026 న
“తెలుగుభాషా సంగీత మహాసభలు” ప్రారంభిస్తున్న
కళారత్న మోదుమూడి సుధాకర్



21.2.2026న గాయత్రీ మహిళా సంగీత సన్మండలి, గుంటూరుసభ
వారినుండి “గాయత్రీ యుగసంగీత రత్న” బిరుదు అందుకున్న
గాయని కుమారి సోమయాజుల విష్ణుప్రియఇందిర, విశాఖపట్నం.



విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల, రాజమహేంద్రవరం, స్వర్ణోత్సవ వేడుకలలో ఒక దృశ్యం.

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721